జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 06, ఏప్రిల్ 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



పాఠకులకు, ప్రకటనకర్తలకు, కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు
శ్రీరామనవమి శుభాకాంక్షలు
- ఎడిటర్

'ప్రేమకు వేళాయరా'

# ఒక అన్న, తమ్ముడు.. ఒక పిఠాపురం.. అదీ సినిమా!

- పిఠాపురంలో ఎమ్మెల్సీ నాగబాబు ప్రారంభోత్సవాలు చేయవచ్చా?
- ఉప ముఖ్యమంత్రి స్థానంలో ఎమ్మెల్సీ ప్రారంభోత్సవాలకు అనుమతిస్తారా?
- శిలాఫలకాలపై నాగబాబు పేరు వేసేందుకు అనుమతించింది ఎవరు?
- మున్సిపల్ మంత్రి సరే.. శిలాఫలకాలపై సీఎం పేరేదీ?
- ఇంకా ఎమ్మెల్సీగా నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకోని నాగబాబు
- అధికారిక ఉత్తర్వులు రాకముందే ఎలా ప్రారంభోత్సవాలు చేస్తారు?
- అదేమయినా ప్రైవేటు, పార్టీ కార్యక్రమాలా?
- కలెక్టర్ ఎలా అనుమతించారు?
- వివాదంగా మారుతున్న ఎమ్మెల్సీ నాగబాబు వ్యవహారం
- పిఠాపురంలో 'ప్రేమకు వేళాయరా'



(మార్తి సుబ్రహ్మణ్యం)

ఒక అక్క.. ఒక బావ.. ఒక అత్త.. ఒక మామ. అదీ సినిమా! ఇది 'ప్రేమకు వేళాయరా' సినిమాలో పండిన డైలాగ్. ఇప్పుడు పవర్‌స్టార్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో మాత్రం అందుకు భిన్నంగా, ఒక అన్న,తమ్ముడు.. ఒక పిఠాపురం.. అదీ సినిమా! అని పేలుతున్న డైలాగు.

ప్రజాస్వామ్యంలో అధికారికంగా బంధాలకు స్థానం ఉండదు. వాటి వెనుక ఏమున్నప్పటికీ, ఏదైనా చట్టబద్ధంగా ఉండాలి. కనిపించాలి కూడా! అప్పుడే విమర్శలు రావు. అధికారం ఉందని నిబంధనలను ఉల్లంఘించి, దానిని కుటుంబ వ్యవహారం చేయకూడదు. అందుకు భిన్నంగా జరిగితే విమర్శలు తప్పవు.

కానీ పిఠాపురం నియోజకవర్గంలో ఒక చిత్రాచిత్రమైన దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. తమ్ముడు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే కమ్ డిప్యూటీ సీఎం. అన్నయ్య ఎమ్మెల్సీ. తమ్ముడు బిజీ కాబట్టి, ఆయన చేయాల్సిన ప్రభుత్వ పరమైన ప్రారంభోత్సవ కార్యక్రమాలు, శంకుస్థాపనలు, జాతినుద్దేశించి ప్రసంగించడాలు అన్నీ అన్నయ్య చేస్తే, దానిని ఎవరైనా అనుమతిస్తారా? ఎవరూ అనుమతించరు. అనుమతించకూడదు. కలెక్టరయితే అసలు అంగీకరించకూడదు. అధికారులు అలాంటి కార్యక్రమాలకు హాజరుకాకూడదు. కానీ గమ్మతుగా వీటికి అభ్యంతరం చెప్పాల్సిన కలెక్టరే.. స్వయంగా ఆ అధికారికమైన 'అనధికార' కార్యక్రమాలకు హాజరయ్యారు. అదే విచిత్రం.

తాజాగా పిఠాపురం నియోజకవర్గంలో.. జనసేన నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పవన్ కల్యాణ్ అన్నయ్య నాగబాబు, వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రజలనుద్దేశించి ప్రసంగించడమే కాకుండా, వారితో ముఖాముఖి నిర్వహించారు. నిజానికి ఇవన్నీ ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం అయిన తమ్ముడు పవన్ కల్యాణ్ నిర్వహించాలి. ఎందుకంటే అక్కడ ఎమ్మెల్యే ఆయనే కాబట్టి. ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలాకాలపైనా ఆయన మిగతా.. 2లో









బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఉండవల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



# ముఖ్యమంత్రి పిలుపుతో పీ4కి అనూహ్య స్పందన

- సొంత డబ్బులతో కొమ్మమూరు లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి ప్రసాద్ సీడ్స్ సంసిద్ధత
- లిఫ్ట్ స్కీం నిర్మాణానికి రూ. 10 కోట్ల వితరణ ఽ ఇస్తామన్న ప్రసాద్ సీడ్స్ చైర్మన్ ప్రసాద్
- కొమ్మమూరు లిఫ్ట్‌తో కాకుమాను మండలంలో 5,315 ఎకరాలకు సాగునీటి స్థిరీకరణ
- రైతుల కోసం లిఫ్ట్ నిర్మాణానికి ముందుకు వచ్చిన ప్రసాద్ ఔదార్యాన్ని అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- సమన్వయం చేసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశం

**అమరావతి:** అట్టడుగున ఉన్న పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తలపెట్టిన పీ4 కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తోంది. ముఖ్యమంత్రి పిలుపు మేరకు... పేదలకు చేయూతను అందించేలా పీ4 కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు సంపన్నవర్గాలు ముందుకొసు న్నాయి. ఇప్పటికే పలువురు పారిశ్రామిక వేత్తలు మార్గదర్శకులుగా ఉండి... బంగారు కుటుంబాలకు సాయంగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో ఏకంగా సొంత నిధులతో ఒక లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మించి ఇవ్వడానికి గుంటూరు జిల్లాలో ఒక పారిశ్రామిక వేత్త ముందుకు వచ్చారు. మిగతా.. 2లో

- బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏపీని ఆవిష్కరించాలన్నదే ఎన్డీఏ లక్ష్యం
- 10 నెలల్లోనే విధ్వంసమైన రాష్ట్రాన్నిగాడిలో పెట్టాం
- ఎస్సీ వర్గీకరణపై మాట నిలబెట్టుకున్నాం
- ఎస్సీల సంక్షేమం కోసం 27 పథకాలను అమలు చేశాం
- పీ-4తో రాష్ట్రం నుంచి పేదరికాన్ని తరిమికొడతాం
- ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్లలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

# జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో బడుగుల అభ్యున్నతికి పునరంకితమవుతాం



**ముప్పాళ్ల, మహానాడు:** జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో బడుగుల అభ్యున్నతికి పునరంకితమవుతామని, బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏపీని ఆవిష్కరించాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఎస్సీల సంక్షేమం కోసం 27 పథకాలను అమలు చేశామని, ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని అన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారం మోపగా కేవలం 10 నెలల్లోనే విధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టామని అన్నారు. పేదరికం లేని సమాజమే తన లక్ష్యమని అందుకే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్లలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. బాలికల గురుకుల వసతి గృహాన్ని సందర్శించారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగంచారు.

### జగ్జీవన్ స్ఫూర్తితో ముందుకెళ్తాం

జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోంది. చిన్నతనంలోనే సమాజంలోని అసమానతలపై జగ్జీవన్ రామ్ పోరాడారు. ఆ రోజుల్లో పాఠశాలల్లో రెండు కుండల సిద్ధాంతం ఉంటే కుండలు బద్దలు కొట్టిన ధైర్యశాలి జగ్జీవన్ రామ్. ఆయన సాధారణ కుటుంబంలో పుట్టి అసాధారణ శక్తిగా మారారు. జగ్జీవన్ రామ్ 1935 నుంచి 1977 వరకూ రాజకీయాల్లో ఉన్నారు. 30 ఏళ్లు కేంద్రంలో మంత్రగా పనిచేశారు. 50 ఏళ్లు ఎంపీగా పనిచేశారు. ఏ పదవిని స్వీకరించినా దానికి వన్నె తెచ్చారు.

### ఎస్సీ వర్గీకరణపై మాట నిలబెట్టుకున్నాం

ఎస్సీలు సమాజంలో ఎదుర్కొంటున్న అసమానతలు, అంటరానితనాన్ని నేను కళ్లారా చూశాను. సమైక్యాంధ్రలో ముఖ్యమంత్రిగా అంటరానితనం రూపుమాపడానికి ఎన్నో జీవోలు జారీ చేశాం. గ్రామాల్లో సాంఘిక సమానత్వంపై అవగాహన సదస్సులు నిర్వహించాం. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అని నినదించిన ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణపై గళం విప్పాను. ఏబీసీడీ కేటగిరీ విభజన కోసం 1996లో కమిటీ వేశాం. అలా ఎస్సీ మిగతా.. 2లో


సమాజానికి మంచి చేస్తేనే గౌరవం, గుర్తింపు లభిస్తుంది 3లో


కార్పొరేటర్లూ.. మీ ఓటు దేశభక్తి పార్టీ అభ్యర్థికా? దేశద్రోహ పార్టీకా? 3లో


నలభై ఐదేళ్ల.. వికసిత 'కమలం'! 8లో



రేవంత్ క్యాబినెట్‌లో పనిమంతులు ఇద్దరేనట! 9లో

# ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్.. అబద్ధాలకు ఆజ్యం!



- ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు
- హెచ్‌సియు ఆందోళనలో ఏఐ కీలక పాత్ర?
- అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష



**హైదరాబాద్‌మహానాడు:** హైదరాబాద్ యూనివర్సిటీ భూములను లాక్కున్నట్లుగా సోషల్ మీడియా నెట్ వర్క్ కృత్రిమంగా వివాదం సృష్టించటం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. కంచె గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, అటవీ శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కంచె గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25లో ఉన్న భూముల్లో గత 25 ఏండ్లుగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్‌బీతో పాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రైవేటు బిల్డింగ్‌లు, రెసిడెన్షియల్ అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ బిల్డింగ్ లను నిర్మించారు. వాటిని నిర్మించేటప్పుడు ఎలాంటి వివాదాలు, ఆందోళనలు జరగలేదని అధికారులు ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకు వచ్చారు. అప్పుడు వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు కూడా లేవన్నారు. మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 06, ఏప్రిల్ 2025 ‖

# ఒక అన్న, తమ్ముడు.. ఒక పిఠాపురం.. అదీ సినిమా!

పేరే ఉండాలి. కానీ అందుకు భిన్నంగా ఆయన పేరుతో పాటు, కొత్తగా ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన అన్నయ్య నాగబాబు పేరు కూడా శిలాఫల కాలపై ప్రత్యక్షమవడం వివాదమే కాకుండా, అభ్యంతరాలకు కారణమయింది. ఇప్పుడు ఇది వైసీపీకి ఆయుధమయింది.

### ఇప్పటిదాకా నియోజకవర్గం ఎంపిక చేసుకోని నాగబాబు

అయితే అసెంబ్లీ వర్గాల సమాచారం ప్రకారం.. మూడు రోజుల క్రితం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబు.. శనివారం రాత్రి వరకూ, తన జిల్లా-నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకోనట్లు తెలుస్తోంది. మరి ఒక ఎమ్మెల్సీ తన నియోజక వర్గం ఏమిటన్నది ఎంపిక చేసుకోకుండా, జీఏడీ నుంచి ఆ మేరకు ఉత్తర్వులు రాకుండా, ఆయన పేరు శిలాఫలకాల్లో ఎలా వేస్తారు? ఆయన ప్రభుత్వ కార్యక్రమాలను ఎలా ప్రారంభి స్తారు? ఇక్కడ పవన్ కల్యాణ్ అన్నయ్య కావడం ఒక్కటే అర్హత కాదు. నిబంధనలు పాటించాలి కదా? ఎలాంటి అధికారం లేని వ్యక్తులు ప్రారంభించే కార్యక్రమాలకు అధికారులు ఎలా హాజరవుతారు? ఇది ప్రభుత్వ కార్యక్రమమా? ప్రైవేటు కార్యక్రమమా? అన్నది రాజకీయ వర్గాలు, సోషల్‌మీడియాలో నె టిజన్ల నుంచి వినిపిస్తున్న ప్రశ్న.

### శిలాఫలకాల్లో సీఎం పేరేదీ?

నాగబాబు ప్రారంభించిన అన్నక్యాంటీ న్ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలపై మున్సిపల్ మంత్రి నారాయణ పేరు పెట్టిన అధికారులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేరు మాత్రం విస్మరించడం, తమ్ముళ్లను అసంతృప్తి పరిచింది. సహజంగా ఏదైనా నియోజకవర్గంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాల్లో ఎంపి, ఆ శాఖ మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతి నిధుల పేర్లు రాస్తుంటారు. ఎంపిలు- ఎమ్మెల్యేలు వచ్చినా, రాకపోయినా ప్రొటోకాల్ ప్రకారం వారి పేర్లు ముద్రిస్తుంటారు. అయితే పిఠాపురం నియోజకవర్గం కాబట్టి.. అంతకుమించి అది పవన్ కల్యాణ్ నియోజకవర్గం కాబట్టి, అక్కడ జరిగే అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం పేరు శిలాఫలకాలపై ఉంచాలి కదా? "అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తొలిసారి డిప్యూటీ సీఎం పవన్ ఫొటోలు పెడుతున్నప్పుడు, ఆయన నియోజకవర్గంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పేరు రాయరా? ఇదేనా మిత్రధర్మం" అని పిఠాపురం తమ్ముళ్లు, కారాలు మిరియాలు నూరుతున్నారు.

### ఎమ్మెల్సీల ప్రొటోకాల్ లెక్క ఇదీ!

నిజానికి ఒక ఎమ్మెల్సీ తనకు ఇష్టమైన నియోజకవర్గాల్లో, ఇష్టమైన జిల్లాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. వాటికి స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. ఒక ఎమ్మెల్సీ ఎన్నికైన తర్వాత.. తాను ఏ జిల్లా, ఏ నియోజకవర్గాన్ని ఎంచుకునే అంశాన్ని అసెంబ్లీ సెక్రటేరియేట్‌కు చెప్పాల్సి ఉంటుంది. దాని ప్రకారం అసెంబ్లీ కార్యదర్శి దానిని జీఏడీకి పంపిస్తారు. జీఏడీ విభాగం సదరు ఎమ్మెల్సీ ఎంపిక చేసుకున్న జిల్లా కలెక్టర్‌కు దానిని పంపిస్తారు. జిల్లా కలెక్టర్ దాని ప్రకారం, సదరు ఎమ్మెల్సీకి నియోజకవర్గంలో ప్రొటోకాల్ ఏర్పాటు చేస్తారు. తర్వాత ఆ నియోజకవర్గంలో జరిగే, అన్ని ప్రభుత్వ కార్యక్రమా లకు సంబంధించిన శిలాఫలకాలపై ఆయన పేరు రాస్తారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానిస్తారు. డీఆర్‌సీ సమావేశాలకూ ఆయనను ఆహ్వానిస్తారు. ఇదీ ఎమ్మెల్సీలకు ఉన్న నిబంధన.



### నాకు సమాచారం లేదు: కలెక్టర్

కాగా ఎమ్మెల్సీ నాగబాబు కాకినాడ జిల్లాలో ఏ నియోజక వర్గాన్ని ఎంపిక చేసుకున్నారన్న విషయం తనకు తెలియదని, అసెంబ్లీ నుంచి తనకు ఎలాంటి సమాచారం లేదని కాకినాడ కలెక్టర్ షన్మోహన్ చెప్పారు. 'మీరు నన్ను ఎందుకు అడుగు తున్నారు? నాకు సమాచారం లేదు' అని వివరణ ఇచ్చారు. జీఏడీ నుంచి ఉత్తర్వులు వచ్చిన తర్వాత కలెక్టర్‌గా ప్రోటోకాల్ ఉత్తర్వులు ఇచ్చేది మీరే కదా అన్న ప్రశ్నకు, నాకయితే సమాచారం లేదు అన్నారు.

# ముఖ్యమంత్రి పిలుపుతో పీ4కి అనూహ్య స్పందన

**మొదటి పేజీ తరువాయి..**

గుంటూరు జిల్లా కాకమాను మండలంలో రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొమ్మమూరు కెనాల్ ద్వారా నీటి సౌకర్యం ఉన్నా... చివరి భూములకు నీరు అందడం లేదు. ఇక్కడ లిఫ్ట్ నిర్మిస్తే ఈ ప్రాంత రైతుల కష్టాలు తీరతాయి. దీంతో ఈ సమస్యను పరిష్కరించడానికి పి4పై సిఎం ఇచ్చిన పిలుపును అందుకుని ప్రసాద్ సీడ్స్ అధినేత ప్రసాద్ ముందుకు వచ్చారు. తమ సొంతూరులో రైతులు సాగునీటి ఎద్దడిని ఎదుర్కోవడం ప్రముఖ విత్తన తయారీ సంస్థ 'ప్రసాద్ సీడ్స్' యాజమాన్యాన్ని కదిలించింది.

సమస్య పరిష్కారం కోసం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించేందుకు ప్రభుత్వంతో భాగస్వాములు అవుతామని ఈ మేరకు ప్రసాద్ సీడ్స్ చైర్మన్ కారుమంచి ప్రసాద్ ముఖ్యమంత్రిని కలిసి వివరించారు. కొమ్మమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం నిర్మాణానికి రూ.10 కోట్లు వితరణ ఇస్తామని చెప్పారు. తద్వారా తమ సొంతూరు కాకుమాను గ్రామంతో పాటు ఆ చుట్టుపక్కల గ్రామాల్లో సాగు నీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ప్రసాద్ వితరణ ఎంతోమందికి స్ఫూర్తి

కారుమంచి ప్రసాద్ సూచించిన విధంగా కొమ్మమూరు ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు డీపీఆర్ సిద్ధం చేసి, త్వరగా అనుమతులు ఇవ్వాలని జలవనరుల శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రసాద్ అందించే ఆర్థిక సాయం ద్వారా లిఫ్ట్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. సొంత గ్రామంలో రైతులకు మేలు చేసేందుకు పెద్దమనసుతో ప్రసాద్ ముందుకు రావడాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. తాను ఏ ఆలోచనతో అయితే పి4 విధానాన్ని ప్రకటించానో.... దాన్ని అర్థం చేసుకుని వివిధ వర్గాల ప్రజలు ముందుకు రావడం తనకు ఎంతో సంతృప్తిని ఇస్తోందని సిఎం అభిప్రాయ పడ్డారు.

### 4 దశాబ్దాలు గా సీడ్స్ బిజినెస్

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కాకుమాను గ్రామానికి చెందిన కారుమంచి ప్రసాద్ 4 దశాబ్దాలుగా విత్తన వ్యాపారంలో ఉన్నారు. 1995 నుంచి ఆ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన సహాయం చేస్తూ వస్తున్నారు. పెదనందిపాడు లిఫ్ట్ స్కీంను పూర్తి చేయడానికి 1995లో ఆయన ఆర్థిక సాయం అందించారు.

### కొమ్మమూరు లిఫ్ట్ ఇలా...:

43 కి.మీ పొడవున్న కొమ్మమూరు కాలువలో చివరి 10 కి.మీ. మేర భూములకు ఎన్నాళ్లగానో సాగునీరు సరిగ్గా అందడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి కాకమాను దగ్గర కొమ్మమూరు కాలువపై లిఫ్ట్‌ను నిర్మించాల్సి ఉంది. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సాకారమైతే కాకమాను, బీకే పాలెం, అప్పాపురం, గరికపాడు, కొండపాతూరు గ్రామాల్లోని సుమారు 5,315 ఎకరాలకు పుష్కలంగా నీరు అందుతుంది.

అలాగే కాకమాను మండలంలో ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుంది. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి 10 కి.మీ. పొడవునా చివరి ఆయకట్టు వరకు 100 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా 100 అడుగుల వెడల్పుతో కాలువ అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. వ్యక్తిగతంగా ఈ ప్రాజెక్టుకు సాయం చేసేందుకు ప్రసాద్ ముందుకు రావడంతో ప్రభుత్వం కూడా అవసరమైన నిధులు వెచ్చించి పనులు పూర్తి చేయనుంది.

నార్త్ బెంగళూరు కమ్మ సంఘం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు















# ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్.. అబద్ధాలకు ఆజ్యం!

**మొదటి పేజీ తరువాయి..**

అలాంటప్పుడు అదే సర్వే నెంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైందని సమావేశంలో చర్చ జరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా వీడియోలు, ఫొటోలు సృష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

వాస్తవాలు వెల్లడించే లోగా అబద్ధాలు సోషల్ మీడియాలో జాతీయ స్థాయిలో వైరల్ కావటం ప్రభుత్వానికి సవాలుగా మారిందని అధికారులు





ముఖ్యమంత్రికి వివరించారు. ఏకంగా నెమళ్లు ఏడ్చినట్లుగా ఆడియోలు, బుల్డోజర్లకు జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్లుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారు చేశారని పోలీసు అధికారులు సీఎంకు వివరించారు. వివిధ రంగాల్లో పేరొందిన ప్రముఖులు కూడా వాటినే నిజమని నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అబద్ధాలకు ఆజ్యం పోసినట్లయిందని అన్నారు.

ఏకంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్ ఫ్ల్యూయెన్సర్ ధ్రువ్ రాఠీ, సినీ ప్రముఖులు జాన్ అబ్రహం, దియా మీర్జా, రవీనా ఠండన్ లాంటి వాళ్లందరూ ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్





ఫొటోలు, వీడియోల పోస్టు చేసి సమాజానికి తప్పుడు సందేశం చేరవేశారని సమావేశంలో చర్చ జరిగింది.

ఈ భూములపై మొట్ట మొదటగా ఫేక్ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్ జా కొద్ది సేపట్లోనే తన పోస్టును తొలిగించి క్షమాపణలు చెప్పారని, కానీ మిగతా ప్రముఖులెవరూ ఈ నిజాన్ని గుర్తించకుండా అదే ఫేక్ వీడియో ప్రచారం చేశారని అధికారులు అభిప్రాయపడ్డారు.

కంచె గచ్చిబౌలిలో ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాలు విసిరిందని ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఇండో పాక్, ఇండో చైనా సరిహద్దుల్లాంటి వివాదాలు, ఘర్షణలకు దారితీసే సున్నితమైన అంశాల్లో ఏఐతో ఫేక్ కంటెంట్ సృష్టిస్తే భవిష్యత్తుల్లో యుద్ధాలు జరిగే ప్రమాదముంటుందని చర్చ జరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తయారు చేసే ఫేక్ వీడియోలు, ఫొటోలు కరోనా వైరస్ ను మించిన మహమ్మారిలాంటివని ఈ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది.

సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏఐ ఫేక్ కంటెంట్ ను పసిగట్టేలా అవసరమైన అధునాతన ఫోరెన్సిక్ హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్ టూల్సు సమకూర్చుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో బడుగుల అభ్యున్నతికి పునరంకితమవుతాం

**మొదటి పేజీ తరువాయి..**

వర్గీకరణ సాకారం కావడంలో నా ప్రయణాం సుదీర్ఘంగా సాగింది. బడుగులకు రాజకీయ అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశానిదే. బాలయోగిని లోక్ సభ స్పీకర్ ని చేశాం. ప్రతిభా భారతిని అసెంబ్లీ స్పీకర్ చేశాం. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు అంబేద్కర్ ను భారతరత్న రావడంలోనూ, నేను యునైటెడ్ ఫ్రంట్ చైర్మన్ చైర్మన్ గా ఉన్నప్పుడు కేఆర్ నారాయణన్ రాష్ట్రపతి కావడంలోనూ కీలకపాత్ర పోషించాం. దేశంలో తొలిసారిగా ఎన్టీఆర్ ఆధ్వర్యంలో జగ్గీవన్ రామ్ విగ్రహం హైదరాబాద్ లో ఏర్పాటు చేశాం.

### ఎస్సీలను ఆర్థికంగా పైకి తెచ్చాం

ఎస్సీల కోసం రూ. 8,400 కోట్లతో ఆర్థిక చేయూత పథకాలు తీసుకొచ్చాం. ఎన్టీఆర్ ప్రారంభించిన రెసిడెన్షియల్ స్కూళ్లలో ఎస్సీ



విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నాం. 1997లో స్టడీ సెంటర్లు ఏర్పాటుచేశాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 190 రెసిడెన్షియల్ స్కూళ్లలో లక్షా 18 వేల మంది విద్యార్థులు ఉన్నారు. రెసిడెన్షియల్ హాస్టళ్లలో లక్ష మంది ఉన్నారు. నూటికి నూరు శాతం ఎస్సీ, బీసీ పిల్లలను రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివించే బాధ్యత తీసుకుంటాం. ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. జగ్జీవన్ జ్యోతి కింద ఎస్సీలకు 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇస్తున్నాం.

2014-19 మధ్య కాలంలో ఎస్సీలకు ఇన్నోవా కార్లు ఇచ్చాం. ఎస్సీ పిల్లలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేశాం. ఎస్సీల



సంక్షేమం, అభ్యున్నతికి మేము తెచ్చిన 27 పథకాలను గత పాలకులు రద్దు చేశారు.. రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల 14 వేల ఎస్సీ కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఈ ఏడాది 20 లక్షల ఎస్సీ కుటుంబాల ఇళ్లకు సోలార్ విద్యుత్ అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నం. ఎన్టీఆర్ భరోసా కింద 11 లక్షల 38 వేల మంది ఎస్సీలకు పింఛను అందిస్తున్నాం. లక్షా 56 వేల కుటుంబాలకు హౌసింగ్‌లో మేలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధాని ఆదర్శ గ్రామ యోజన కింద రూ. 62 కోట్లతో ప్రత్యేక వసతులు కల్పిస్తున్నాం. ఎస్సీలకు నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా స్వయం ఉపాధి కల్పిస్తున్నాం.

### పీ-4తో చరిత్ర తిరగరాస్తాం

పేదరికం నిర్మూలనే లక్ష్యంగా పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. సమాజంలో ధనవంతులు మరింత ధనవంతులుగా పేదలు మరింత పేదలుగా తయారవడం ప్రమాదకరం. సమాజం మనకు ఎంతో ఇచ్చింది. మనం తిరిగి సమాజానికి ఎంతో కొంద మేలు చేయాలి. అందుకే సమాజంలో అవకాశాలు అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదిగిన వారు అట్టడుగున ఉన్న పేదలను ఆదుకునే బాధ్యత తీసుకోవాలి. చేతనైనంత సాయం చేసి వారిని అన్ని విధాలా పైకి తేవాలి.

పీ4 విధానం ద్వారా సమాజంలో ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న 10 శాతం మంది...అట్టడుగున ఉన్న 20 శాతం మందికి చేయూతను ఇవ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల కుటుంబాలను ఎంపిక చేశాం. ఒకప్పుడు నేనిచ్చిన జన్మభూమి పిలుపుకు స్పందించి ప్రపంచంలోని తెలుగువారు కదిలివచ్చారు. సొంతూర్లలో రోడ్లు వేశారు. స్మశానాలు కట్టించారు. ఆ స్ఫూర్తి కొనసాగించాలని మార్గదర్శిలను కోరు తున్నాను. దాతలు ముందుకొచ్చి బంగారు కుటుంబాలను తయారు చేస్తే వారు ఆర్థికంగా ఎదిగి మార్గదర్శిలుగా తయారవుతారు.

### విధ్వంసమే అజెండాగా గత ఐదేళ్ల పాలన

నాయకుడు దూరదృష్టితో ఆలోచిస్తే రాష్ట్రం బాగుపడుతుంది. ఒక నాయకుడు విధ్వంసపు ఆలోచనలు చేస్తే ఆ రాష్ట్రం నాశనమవుతుంది. గత పాలకులు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో భ్రష్టు పట్టించారు. రాష్ట్రాన్ని రాబందుల్లా దోచుకున్నారు. రూ. 10 లక్షల కోట్ల అప్పులు మన నెత్తిపై వేశారు. ఎన్నో ఇబ్బందులు ఉన్నాయి. అయినప్పటికీ ప్రజా సేవే పమావధిగా ముందుకు వెళ్తున్నాను.

### బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏపీ

నేను నిత్యం సమాజాన్ని అధ్యయనం చేస్తూ ఉంటాను. ఏదయినా 20, 30 ఏళ్ల ముందే ఆలోచిస్తాను. నా మాటలు ఆచరణలో పెట్టిన వారు బాగుపడ్డారు. నాటి ప్రధాని పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు తీసుకొస్తే నేను రెండో తరం సంస్కరణలకు శ్రీకారం చుట్టాను. ప్రధాని మోదీ సమర్థ నాయ కత్వంలో 2047 నాటికి ప్రపంచంలో భారతదేశం అగ్రస్థానంలో ఉంటుంది.. అమెరికా వంటి దేశాల్లో అక్కడి వారికంటే మన భారతీయులదే అత్యధిక తలసరి ఆదాయం నమోదవుతోంది.

స్వర్ణాంధ్ర విజన్‌లో బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏపీని ఆవిష్కరించాలనేది ఎన్డీఏ ప్రభుత్వ సంకల్పంగా పెట్టుకున్నాం. 2047 నాటికి రూ.54.60 లక్షల తలసరి ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నాం. తలసరి ఆదాయం 2023-24 మధ్య రూ.2.66 లక్షల కాగా 2024-25 మధ్య రూ.2.98 లక్షలకు పెరిగింది.

### అందరికీ సంక్షేమం

ఓవైపు అర్హులకు సంక్షేమం అందిస్తూనే మరోవైపు రాష్ట్రమం తటా అభివృద్ధి పనులు పరుగులు పెట్టిస్తున్నాం. గత ప్రభుత్వం కక్షపూరితంగా నిలిపేసిన అమరావతి పనులు మొదలుపెట్టాం. గత పాలకులు గోదావరిలో కలిపేసి పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయి. నా ఆడబిడ్డలు ఇబ్బంది పడకూడదని ఆనాడు దేశంలోనే మొదటిసారిగా దీపం పథకానికి శ్రీకారం చుట్టాను.నేడు దీపం 2 కింద పేదలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు రూ.4 వేలు ఇస్తున్నాం. రూ.500 ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేలు చేశాం. దాన్ని మళ్లీ ఇప్పుడు రూ. 6 వేలకు పెంచాం. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, మంచానికే పరిమితమైనవారికి మానవతా దృక్పథంతో రూ.15 వేలు ఇస్తున్నాం.

ఇంతమంచి కార్యక్రమాలు చేస్తున్నప్పుడు ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతో ప్రతినెలా 1వ తేదీన పేదల సేవలో కార్యక్రమం నిర్వహి స్తున్నాం. రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లు నెలకొల్పాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రభుత్వ రుణాల ద్వారా స్వయం ఉపాధి కల్పిస్తున్నాం. మే నెలలో ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద నగదు జమ చేస్తాం. అన్నదాత సుఖీభవ కింద కింద రైతులకు రూ. 20 వేలు ఇస్తాం.

మత్స్యకారుల జీవనోపాధికి రూ. 20 వేలు ఆర్థిక సాయం అందిస్తాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందిస్తున్నాం. జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు జనాభా నియంత్రణపై నేను మాట్లాడాను. ప్రతి జంటా ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలను కనాలని నేనే పిలుపునిస్తున్నాను. అభివృద్ధి చెందిన దేశాలు జనాభా కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. ఆ



పరిస్థితి మనదేశానికి రాకూడదన్నదే నా ఉద్దేశం. అలాగే నేను తెచ్చిన డ్వాక్రా సంఘాలు నేడు ఒక వ్యవస్థగా మారడం నాకు ఎంతో సంతోషాన్నిస్తుంది.

### 'నందిగామ'లో అభివృద్ధి పరుగులు

నందిగామలో గత ఐదేళ్లలో అభివృద్ధి జరగలేదు. పాలకుల నిర్లక్ష్యంతో వేదాద్రి ఎత్తిపోతల పథకం పడకేసింది. వేదాద్రి లిఫ్ట్ ఇరిగేషన్ పనుల కోసం రూ.15 కోట్లు విడుదల చేస్తాం. రైతులకు ఇబ్బంది లేకుండా రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రతి ఎకరాకు నీరు అందిస్తాం. ఏటూరు, ముగులూరు కాజ్ వే పనుల కోసం రూ. 2 కోట్ల 20 లక్షలు విడుదల చేస్తాం. కంచకచర్ల మండలంలో స్థానికంగా బ్రిడ్జ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తాం. సుబాబుల పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

అమెరికాలో పరిణామాల వల్ల ఆక్వా రంగం దెబ్బతినే పరిస్థితి నెలకొంది. ఆక్వా సాగుపై దృష్టిపెడతాం. అలాగే రైతులు పండించే ప్రతి పంటకూ గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షితమైన నీరు, అర్హులకు ఉచిత కరెంటు, ఇండ్లపై సోలార్ రూఫ్ టాప్ ల ఏర్పాటు, ఇంటర్నెట్, మరుగుదొడ్లు నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు వరకూ కరెంటు ఉచితంగా ఇస్తున్నాం.

ముప్పాళ్ల గ్రామంలోని ఎస్సీలందరూ 240 యూనిట్లు కరెంటు ఉత్పత్తి చేసుకునేలా రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేస్తాం. బీసీలకు కూడా రెండు కిలో వాట్లకు రూ. 20 వేల రూపాయిలు అదనంగా సబ్సిడీ ఇస్తాం. మూడు కిలో వాట్లు పెట్టుకుంటే రూ. 98 వేల సబ్సిడీ ఇస్తాం. అగ్రవర్ణాల వారు సోలార్ ఏర్పాటు చేసుకుంటే మూడు కిలోవాట్లకు రూ. 78 వేలు ఇస్తాం. పొలాల్లో పంప్ సెట్లకు సోలార్ ఉచితంగా పెట్టిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 06, ఏప్రిల్ 2025 ||



## దళిత ఉద్ధరణ నేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్

- ఎమ్మెల్యే వేగుళ్ళ

మండపేట, మహానాడు: దళిత ఉద్ధరణ నేత డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు ఆధ్వర్యంలో మండపేట మాదిగపేట లో శనివారం జగజ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేగుళ్ళ పాల్గొని, ఆయన ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సవరపు సతీష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు దూలి జయరాజు మాదిగ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, టీడీపీ నాయకులు చాపల వీరబాబు, పెందుర్తి ప్రదీప్, వల్లూరి ఇందిరా దొరకయ్య, సాల్మన్, గోసాల ప్రసాద్, రాజు, ముమ్మిడివరపు నారాయణ, మోరంపూడి సూరిబాబు,



గంధం శ్రీను, మోరంపూడి విజయ్, గుండు తాతరాజు, పెందుర్తి వెంకటేష్, బొమ్ము గంగాధర్, గోసాల నవీన్, బొడ్డపాటి మోషే, దూలి ప్రవీణ్, తదితర్లు పాల్గొన్నారు.

# సమాజానికి మంచి చేస్తేనే గౌరవం, గుర్తింపు లభిస్తుంది




- పేద కుటుంబాలు పైకి రావాలి
- ముప్పాళ్లలో 'మార్గదర్శి-బంగారు కుటుంబం'లో సీఎం చంద్రబాబు

ముప్పాళ్ల, మహానాడు:

సమాజానికి ఏదైనా మంచి చేసినప్పుడు తృప్తి కలుగుతుంది. గుర్తింపు, గౌరవం కావాలని కొందరు అనుకుంటుంటారు. డబ్బుతో ఎప్పుడూ గౌరవం రాదు. సమాజానికి మంచిపని చేస్తేనే గౌరవం, గుర్తింపు లభిస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా, నందిగామ నియోజకవర్గం, ముప్పాళ్లలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం అనంతరం మార్గదర్శి-బంగారు కుటుంబం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ గ్రామంలో 41 పేద కుటుంబాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ప్రజా వేదిక సభలో బంగారు కుటుంబ సభ్యుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్గదర్శి గోగినేని రవిచంద్రను సన్మానించారు. అనంతరం సీఎం మాట్లాడారు.

### ప్రపంచంలోనే అద్భుత కార్యక్రమం పీ4

'మార్గదర్శి-బంగారు కటుంబం' ఒక చరిత్రాత్మక కార్యక్రమం. ఇటువంటిది ప్రపంచంలో ఎక్కడా లేదు. ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావడంతో పాటు ఆర్థిక సంస్కరణలు కూడా



తీసుకొచ్చాయి. సంక్షేమ కార్యక్రమాలతో కొంత వెసులుబాటు వచ్చినా అసమానతలు తగ్గడం లేదు. ప్రజల జీవనప్రమాణాలు పడిపోతున్నాయి.



పేదరికం వెంట తెచ్చుకుంటే వచ్చేది కాదు. తరతరాలు పేదరికంలోనే ఉంటూ ఇబ్బందులు పడుతున్నారు.

పీ4 ద్వారా పేదలకు సహకారం అందుతుంది. భారతరాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్‌కు ఆ రోజుల్లో బరోడా మహారాజు ఆర్థిక సహకారం అందించారు. లండన్ వెళ్లి చదువుకోవడానికి చేయూత నిచ్చారు. దేశం మెచ్చుకునే మేథావిగా అంబేద్కర్ తయారయ్యారు. అబ్దుల్ కలాం లాంటి గొప్ప వ్యక్తి వెనక కూడా అయ్యంగార్ ఉన్నారు.



కలాంను అయ్యంగార్ శిష్యుడిగా దగ్గరకు తీసుకుని గణితం, సైన్స్ నేర్పించి శాస్త్రవేత్త అవ్వడానికి సాయపడ్డారు. వివేకానందను రామకృష్ణ పరమహంస తీర్చిదిద్దారు.' అని సీఎం అన్నారు.

### పేద పిల్లలు పైకి ఎదగాలి

'స్వాతంత్ర్య సమరయోధులు గాంధీ అయినా, ఎన్టీఆర్, మోదీ, నేను చిన్న కుటుంబాల్లోనే పుట్టాం. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని అంచలంచెలుగా ఎదిగాం. మీ పిల్లలు కూడా ఇదే విధంగా పైకి రావాలి. అందుకే ఈ పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. పేద




కుటుంబాలను పేదరికం నుంచి పైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ పీ4 తెచ్చాం. ఈ గ్రామంలో గుర్తించిన 41 బంగారు కుటుంబాలతో పాటు ఎవరైనా బంగారు కటుంబంలో చేరే వారికి అవకాశం కల్పిస్తాం. బాగా చేసిన మార్గాదర్శులను గౌరవించి, సన్మానిస్తాం.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

### బంగారు కుటుంబానికి ఎంపికైన వారు మాట్లాడుతూ...

పగడాల నాగరత్నం మాట్లాడుతూ నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబు రెండో క్లాసు చదవుతున్నాడు. నా భర్త పొలం పనులకు వెళు_న్నారు. సొంత ఇళ్లు, స్థలం కూడా లేదు. నేను కుట్టుపని నేర్చుకుంటున్నాను. నాకు కుట్టు మిషన్, నా భర్తకు ఇటో అందిస్తే ఉపాధి పొందుతాం.

**భాగ్యమ్మ... నాకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. నేను ప్రస్తుతం వేరుగా ఉంటున్నా. నా భర్త ఏడాది క్రితం చనిపోయారు. నాకు పెన్షన్ అందించాలని కోరుతున్నా.**

**సీఎం: కలెక్టర్ గారు... భాగ్యమ్మకు వెంటనే పింఛను మంజూరు చేయండి.**

రమాదేవి: నేను ఇంటర్మీడియట్ చదివా, నా భర్త ఆరవ తరగతి



చదివారు. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు ప్రభుత్వ స్కూళ్లో చదువుకుంటున్నారు. నా భర్త కూలీ పనులకు వెళ్తే రోజూ రూ.300 వస్తోంది. మాకు ఉండటానికి సొంత ఇల్లు లేదు. ఇల్లు కట్టించి, గేదెలు అందిస్తే వాటిని చూసుకుంటాం.

కోండ్రు రమేష్: మాకు సొంత ఇల్లు లేదు. నా భార్య, కుమారుడు చనిపోయారు. చిన్న కొడుకు ఏడవ తరగితి చదువుకుంటున్నాడు. నేను కూలీ పనులకు వెళ్తే రోజుకు రూ.350 వస్తుంది. 18 ఏళ్ల వయసు కొడుకును పోగొట్టున్నా, సాయం అందిస్తే చిన్నకొడుకునైనా చదివించుకుంటాను.

### మార్గదర్శులు మాట్లాడుతూ....

గోగినేని రవిచంద్ర: సీఎం చంద్రబాబు తీసుకొచ్చి పీ4 - జీరో పావర్టీ కార్యక్రమం స్ఫూర్తి నింపేలా ఉంది. పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలు దీని గురించి ఆసక్తిగా అడుగుతున్నారు. గతంలో ఏదైనా సాయం అందించడానికి లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయడానికి సమయం పట్టేది. లబ్ధిదారులకు నిజంగా చేరుతుందా లేదా అనే సంశయం కలిగేది. కానీ ఈ పీ4 అందరికీ అందుబాటులో ఉంది. పెద్దవరం గ్రామంలో మాకు ఇథనాల్ తయారీ యూనిట్ ఉంది.

గతేడాది కొత్త యూనిట్ కూడా ప్రారంభించాం. 480 మంది ఉపాధి పొందుతున్నారు. బంగారు కుటుంబంలో ఎంపికైన పగడాల నాగరత్నం బిడ్డల చదవును మేం భరిస్తాం. ఆమె భర్తకు ఆటో ఇవ్వడంతో పాటు మా ప్యాక్టరీలో వ్యాపారం చేసుకుని ఎంట్రప్రెన్యూర్ అయ్యే అవకాశాన్ని కల్పిస్తాం. నాగరత్నం కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటాం. వారి కుటుంబ ఎదుగుదలకు మా సంస్థ నుంచి పూర్తి సహకారం అందిస్తాం. ఈ సందర్భంగా గోగినేని రవిచంద్రను సీఎం అభినందించారు.

### తోటకూరి శ్రీనివాసరావు, గ్రీన్ వే గ్రూప్ ఆఫ్ కంపెనీ

పరిటాలలో మేం బ్రిక్స్ ఫ్యాక్టరీ పెట్టాం. జన్మభూమి కార్యక్రమం రూపంలో పీ4 వచ్చింది. మేం ఒక కుటుంబాన్ని దత్తత తీసుకున్నాం. ప్రతిరోజూ ఇద్దరు ముగ్గురితో మాట్లాడి నాలుగైదు కటుంబాలు దత్తత తీసుకునేలా చేస్తాం. మాకు దాదాపు 500 కన్సల్టెన్సీలతో సంబంధాలు



ఉన్నాయి. డిజిటల్ మార్కెట్‌లో ఈ పీ4 ప్రమోట్ చేస్తాం. ఒక 1000 కుటుంబాలు బంగారు కుటుంబంలో ఎంపికయ్యేందుకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తాను.

### జయేష్ కుమార్ షా, ట్విల్స్ క్లాతింగ్ ఇండియా డైరెక్టర్

మేం ఈ నేలపై పుట్టి పెరిగాం. మాకు ఈ జన్మభూమి చాలా ఇచ్చింది. వచ్చిన అవకాశాలతో వ్యాపారం చేసి పైకి ఎదిగాం. మాకు ఎంతో ఇచ్చిన ఈ సమాజానికి తిరిగి ఇచ్చే బాధ్యత ఉంది. ఈ పీ4 గురించి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ చెప్పినప్పుడు చాలా సంతోషాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చింది. నాకు ఏ బాధ్యత అప్పగించినా తప్పకుండా ముందుకు తీసుకెళ్తాను.

### మధుసూధన్ రావు, కేసీపీ ఇండియా షుగర్ ఫ్యాక్టరీ ప్రతినిధి :

ఈ పీ4 వినూత్న కార్యక్రమం. దేశంలోనే ఇది మొట్టమొదటి కార్యక్రమం. పేదరిక నిర్మూలన కోసం మీరు వేసిన అడుగులో మేం అడుగుల వేస్తాం.

ముక్త్యాల గ్రామాన్ని మేం దత్తత తీసుకున్నాం. గ్రామంలో 800 మందికి హెల్త్ కార్డులు అందించాం. ముప్పాలలో వేల్పుల మణెమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకుంటాం. ఆ కుటుంబంలోని విద్యార్థులకు విద్యకు అవసరమైన సాయాన్ని అందిస్తాం.

### వల్లభనేని రామకృష్ణ, అంబా కోచ్ బిల్డర్స్

మీ స్ఫూర్తితో మేం ఒక కుటుంబాన్ని దత్తత తీసుకుంటాం. విద్య, వైద్యానికి సంబంధి కుటుంబ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తాం.

## కార్పోరేటర్లూ.. మీ ఓటు దేశభక్తి పార్టీ అభ్యర్థికా? దేశద్రోహ పార్టీకా?

- అట్టడుగువర్గాల ఆణిముత్యం జగ్జీవన్ రాం
- కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ
- అంబేద్కర్ నుండి జగ్జీవన్ రాం వరకు అడుగడుగునా అవమానించిన పార్టీ కాంగ్రెస్
- అంబేద్కర్‌ను మంత్రి పదవికి రాజీనామా చేయించిన పార్టీ కాంగ్రెస్
- తెలంగాణలో రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తోంది మోదీ బియ్యమే
- రేషన్ బియ్యం ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం మోదీదే
- రేషన్ షాపుల వద్ద ప్రధాని ఫోటో పెట్టాల్సిందే
- బాబూ జగ్జీవన్‌రామ్ సంస్మరణ సభలో కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్: ఓటేయబోయే హైదరాబాద్ కార్పోరేటర్లూ.. దేశభక్తి పార్టీ అభ్యర్థికి ఓటేస్తారా? దేశద్రోహ పార్టీకి ఓటేస్తారా? ఆలోచించండి. ఇయాళ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసే మజ్లిస్ కు మద్దతిస్తున్నాయి. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దేశద్రోహ మజ్లిస్ పార్టీకి, దేశభక్తిగల బీజేపీ పార్టీకి మధ్య జరుగుతున్న ఎన్నికలివి.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీపడి హైదరాబాద్ ను మజ్లిస్ కు అప్పగించేందుకు సిద్ధమైనయ్. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటే. డీలిమిటేషన్ పేరుతో రెండు పార్టీలు కలిసే చెన్నైయ్ మీటింగ్ లో పాల్గొన్నయ్. త్వరలో రెండు పార్టీలు కలిసి ఇదే అంశంపై హైదరాబాద్ లో బహిరంగ సభ పెడుతున్నయ్. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేసినయ్. వీధినాటాలడే కళాకారులను మైమరపించేలా కాంగ్రెస్ నేతల డ్రామాలాడుతున్నరు.

వడ్ల కొనుగోలు పేరుతో ప్రతి సీజన్ కు సగటున రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ లెక్కన ఏటా సగటున రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తున్న ఘనత మోదీ ప్రభుత్వానిదే. ఈ ఏడాది వానా కాలం సీజన్ కు రూ.12 వేల కోట్లకుపైగా ఖర్చు చేసినం. యాసంగి ఇంకా పూర్తి కాలేదు. వడ్లకు కనీస మద్దతు ధర రూ.2203లు చెల్లిస్తోంది మోదీ ప్రభుత్వమే. ఇవిగాక రవాణా, మిల్లింగ్, డిస్ట్రిబ్యూషన్ ఛార్జీలతోపాటు మిత్తీతో సహా వడ్ల పైసలు చెల్లిస్తోంది. ఈ లెక్కన ఒక్క కిలో బియ్యానికి రూ.37 లు ఖర్చు చేస్తున్న ఘనత మోదీ ప్రభుత్వమే.

అయినప్పటికీ సన్న బియ్యం పేరుతో కాంగ్రెస్ తామే సొంతంగా



పంపిణీ చేస్తున్నట్లు డ్రామాలాడుతోంది. ఇంత ఖర్చు చేసి పేదలకు ఉచితంగా మోదీ ప్రభుత్వం పంపిణీ చేస్తుంటే... కనీసం ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరు? బీజేపీ కార్యకర్తలు రేషన్ షాపుల వద్ద ప్రధాని ఫోటోలు పెడితే చించి వేయించడం ఎంత వరకు కరెక్ట్? ప్రధాని ఫొటో పెడితే మీకున్న అభ్యంతరమేంది? తక్షణమే రేషన్ షాపుల వద్ద ప్రధాని ఫోటో పెట్టాల్సిందే. మోదీ బియ్యం తీసుకుంటున్న పేదల ఇండ్ల వద్దకు వెళ్లి, భోజనం చేసి సమస్యలు తెలుసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షులకు పిలుపునిస్తున్నా. హెచ్ సీయూ భూముల విషయంలో కాంగ్రెస్ అమానుషంగా వ్యవహరించింది. ప్రభుత్వ తీరును వ్యతిరేకించిన యూనివర్శిటీ స్కాలర్ రోహిత్ పై దాడి చేసి జైలుకు పంపుతారా? అక్రమంగా ఆయుధాల కేసు పెట్టి రోహిత్ జీవితాన్ని నాశనం చేస్తారా? విద్యార్థులపై ఇంత అమానుషంగా వ్యవహరించిన కాంగ్రెస్ తీరును జనం అసహ్యించుకుంటున్నారు. బేషరతుగా విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలి.

భూముల అమ్మకాల్లో బీఆర్ఎస్ ను మించి కాంగ్రెస్ పోటీ పడుతోంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో భూములమ్మి రూ.20 వేల కోట్లు దోచుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అంతకు మించి దోచుకునేందుకు భూములమ్మేందుకు సిద్ధమైంది. ఈ రెండు పార్టీలు కలిసి భావి తరాలకు గజం జాగా లేకుండా చేస్తున్నాయి. హైదరాబాద్ ఆదాయాన్ని ఆదిలాబాద్ లో ఖర్చు పెడితే లేని తప్పు, వెనుకబడిన ప్రాంతాలకు కేంద్రం ఖర్చు చేస్తే తప్పేంది?



## 'అమరావతి' నిర్మాణానికి మిగిలిన నిధులు వివిధ రూపాల్లో సమీకరణ

- సీఆర్డీయే 46వ అథారిటీ సమావేశం తీర్మానం

అమరావతి, మహానాడు:

అమరావతి రాజధాని నిర్మాణం కోసం అవసరమైన మిగిలిన నిధులు వివిధ రూపాల్లో సమీకరించేందుకు సీఆర్డీఏ కమిషనర్ కు అనుమతిస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో శనివారం సీఆర్డీయే 46వ అథారిటీ సమావేశం జరిగింది. ఆ వివరాలివి.. పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా మిగిలిన అవసరమైన నిధులను వివిధ ఫైనాన్సియల్ ఇన్ స్టిట్యూషన్స్ నుంచి సమీకరించేందుకు సీఆర్డీఏ కమిషనర్‌కు అథారిటీ అనుమతించింది. అసెంబ్లీ,హైకోర్టు భవనాల టెండర్లకు ఆమోదం, ఎల్ వన్ గా నిలిచిన సంస్థలకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ ఇచ్చేందుకు ఆమోదముద్ర.

అసెంబ్లీ బేస్‌మెంట్ + జీ + 3 + వ్యూయింగ్ ప్లాట్ ఫాంలు + పనోరమిక్ వ్యూ(బిల్టప్ ఏరియా 11.22 లక్షల చదరపు అడుగులు, ఎత్తు 250 మీటర్లు). అసెంబ్లీ నిర్మాణానికి టెండర్లలో ఎల్ వన్ గా నిలిచిన సంస్థకు LOA ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. అదే విధంగా హైకోర్టు బేస్‌మెంట్ + జీ + 7 అంస్తుల్లో నిర్మాణం. బిల్టప్ ఏరియా 20.32 లక్షల చదరపు అడుగులు..ఎత్తు 55 మీటర్లు...ఎల్ వన్ గా నిలిచిన సంస్థకు ఎల్‌వోఏ ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 06, ఏప్రిల్ 2025 ||



## నేటి నుంచి కోదండరామయ్య బ్రహ్మోత్సవాలు




**వైస్సార్ కడప:** ఆంధ్రా భద్రాద్రి ఒంటిమిట్ట కోదండ రాముని బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు జరగనున్నట్టు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సీతారాముల కల్యాణం 11వ తేదీ సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు నిర్వహించనున్నారు.

## శరవేగంగా పోలవరం పనులు

**- మాజీ మంత్రి పీతల సుజాత**



**మంగళగిరి, మహానాడు:** పోలవరం ప్రాజెక్టును అనుకున్న సమయానికి పూర్తిచేసి ప్రతి ఆయకట్టుకు నీరందించాలనేదే చంద్రబాబు ధ్యేయం. రైతుల కళ్లల్లో సంతోషాన్ని చూడాలనేదే చంద్రబాబు ఏకైక లక్ష్యం. రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాష్ట్రానికి నష్టం జరిగింది. అంతకంటే ఎక్కువగా వైసీపీ పాలనలో జరిగింది. 2014-19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా రూ.11,762 కోట్లు పోలవరం ప్రాజెక్టు కోసం ఖర్చు చేశారని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. ఈ మేరకు ఆమె ఇక్కడ శనివారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. జగన్ హయాంలో రూ. 4,167 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అందులో 3 శాతం మాత్రమే పనులు జరిగాయి. చేసిన పనులు కూడా నాసిరకంగా జరిగాయి. తెలుగుదేశం హయాంలో 72 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఆమె ఇంకా ఏమన్నారంటే..

వైసీపీ హయాంలో పోలవరం నిధులను పూర్తిగా దోచేశారు. వైసీపీ హయాంలో డయాఫ్రం వాల్ కొట్టుకు పోయిందంటే వైసీపీ నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోవచ్చు. జగన్ తప్పిదం వల్లే డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినట్లు నీతిఆయోగ్ కూడా నిర్ధారించింది. జగన్ ప్రభుత్వ అసమర్థత వల్ల భావితరాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఎంతగానో నష్టం జరిగింది. చంద్రబాబుకు ప్రజల పట్ల నిబద్ధత ఉంది. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ రాజధాని లేనప్పటికి చంద్రబాబు చెట్టుకింద ఉండి పరిపాలన సాగించారు. అప్పుడు ఉద్యోగస్థులు కూడా టీడీపీకి సహకరించడం గొప్ప విషయం. పోలవరం లోని 7 ముంపు మండలాలు ఏపీలో కలపాలని చంద్రబాబు పట్టుబట్టారు. రాజ్యసభ, లోక్ సభలో పోరాడారు. బిల్ అయితేనే తప్ప తాను సీఎంగా ప్రమాణస్వీకారం చేయనని మొండికేశారు.

రాష్ట్రం పట్ల చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంది. స్వార్థానికి ఆమడ దూరంలో చంద్రబాబు ఉంటారు. రాష్ట్రంలో చంద్రబాబు అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. చంద్ర బాబు లాంటి వ్యక్తి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం అదృష్టంగా భావించాలి. రైతుల కోసం, పోల వరం ముంపు నిర్వాసితుల కోసం, ముంపు మండలాల ప్రజలకోసం ఆయన పనిచేశారు. జగన్ అధికారంలోకి వచ్చాక పోలవరాన్ని రాష్ట్ర ప్రభుత్వం కట్టాల్సిన పనిలేదని చేతులు దులుపుకున్నారు. పోలవరం నిర్మాణాన్ని జగన్ గాలికొదిలేశారు. పోలవరం ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. చంద్రబాబు అధికారంలోకి రాగానే పరుగులు పెట్టించారు.

పోలవరం విషయంలో జగన్ క్షమించరాని నేరం చేశారు. పోలవరం నిర్మాణంలో జాప్యం కారణంగా ఆనాడు రూ.40 వేల కోట్ల పంట నష్టం జరిగింది. బిల్లులు చెల్లించని కారణంగా కాంట్రాక్టర్లు ఇబ్బందుల పాల య్యారు. బకాయిలు చెల్లించడానికి కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. త్వరితగతిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. అనుకున్న సమయానికి ప్రతి ఎకరాకి నీరందించేందకు కృషి చేస్తాం. కూటమి ప్రభుత్వం ఏకైక లక్ష్యంతో ముందుకెళ్తోంది.

## త్వరలో కొత్త రూ.10, 500 నోట్లు?



**న్యూఢిల్లీ, మహానాడు:** ప్రస్తుతం అందుబాటులో ఉన్న నోట్ల మాదిరిగానే ఈ నోట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరో కీలక నిర్ణ యం తీసుకుంది. ఆర్‌బీఐ నూతన గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో కూడి న కొత్త రూ.10, రూ.500 నోట్లు త్వరలో జారీ చేయనున్నారు.

మహాత్మ గాంధీ సిరీస్‌లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నోట్ల మాదిరిగానే ఈ నోట్లూ ఉండబోతున్నా యని ఆర్‌బీఐ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త నోట్లను జారీ చేసినప్పటికీ, రిజర్వ్ బ్యాంక్ గతంలో జారీ చేసిన రూ.10, రూ.500 డినామినేషన్ల లోని అన్ని (పాత) నోట్లు చట్టబద్ధంగా చెలామణిలో కొనసాగుతాయి.

గవర్నర్ మల్హోత్రా సంతకంతో కూడిన రూ.100, రూ.200 నోట్లను కూడా విడుదల చేస్తున్నట్లు ఆర్‌బీఐ గత నెలలో ప్రకటిం చింది. కొత్త గవర్నర్‌గా మల్హోత్రా 2024 డిసెం బర్‌లో సంజయ్ మల్హోత్రా ఆర్‌బీఐ కొత్త గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆరేళ్ల పాటు పదవిలో ఉన్న శక్తికాంత దాస్ స్థానంలో ఆయన నియమితులయ్యా రు. కొత్త గవర్నర్ చేరుకున్న వెంటనే కొత్త సంతకాలతో నోట్లు విడుదల చేస్తుంటా రు. కానీ దీని వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పాత నోట్ల విలువ మారదు.

ఇప్పటివరకు ఉన్న రూ. 500 నోట్లు బూడిద స్టోన్ (గ్రే),రంగులో ఉన్నాయి. అయితే కొత్త నోట్లలో రంగు, పరిమాణం, డిజైన్‌లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది. కొత్త రూ.500 నోట్ల పరిమాణం 66mm x 150mmగా నిర్ణయించినట్టు సమాచారం.

## తేమ శాతం అంటూ ధాన్యం రైతును ఇబ్బంది పెట్టొద్దు

**- మంత్రి కందుల దుర్గేష్**



**నిడదవోలు, మహానాడు:** రైతులు పండించిన ప్రతీ గింజను కొనాలని కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలం మోర్తా గ్రామంలో శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడుతో కలిసి మంత్రిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిం చారు.ఈ సందర్భంగా రైతు గొప్పదనాన్ని, రైతన్నల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న మేలును మంత్రి కందుల దుర్గేష్ స్పష్టంగా వివరించారు. రైతు సేవా కేంద్రం వద్ద డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి కందుల దుర్గేష్ నివాళు లర్పించారు. అనంతరం ధాన్యం బస్తాల ట్రాక్టర్ ను నడిపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రైతులకు తాము పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర కంటే అధిక ధర లభిస్తే నచ్చిన చోట అమ్ముకోవచ్చని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్ లో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 2 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 2.50 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామని తెలిపారు. ఇప్పటికే ఈ విషయమై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అంగీకారం తెలిపారని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంతో రైతులంతా సంతోషంగా ఉన్నట్టు గమనించానన్నారు. గతంలో రైతన్న ఆరుగాలం శ్రమించి పండించి పంటకు నెలలు గడిచినా రైతుల ఖాతాల్లో నగదు పడని సందర్భం చూశామన్నారు. గత ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులను అధిగమించి కూటమి ప్రభుత్వం కేవలం 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తుందన్నారు. గతంలో రైతు భరోసా అని పేరు పెట్టి అన్నదాతలను మోసం చేశారని మంత్రి గుర్తుచేశారు.

ధాన్యం తేమశాతం విషయంలో రైతులను ఇబ్బం దులకు గురిచేయవద్దని, అటు ఇటుగా ఎలా ఉన్నా సేకరించాలని అధికారులకు సూచించినట్లు తెలిపామ న్నారు. ధాన్యం అమ్ముకునేందుకు వచ్చే రైతును నిరీక్షణ చేయవద్దని ఆదేశించామన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతు వెంటనే అమ్ముకునే సౌకర్యాన్ని కల్పించామ న్నారు. మిల్లర్లకు గోనె సంచుల కొనుగోలుకు ప్రభుత్వం రూ.3.75 ఇస్తోందన్నారు. ఈ నేపథ్యంలో నాణ్యత లేని సంచులను ఇవ్వొద్దని హెచ్చరించామన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు ఆంధ్రప్రదేశ్ కు అన్నపూర్ణలాంటివని గుర్తుచేశారు. రైతు ధాన్యం పండిస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. అన్నం పెట్టి ఆదుకునే రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, నాయకులు, అధికారులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, ఆర్డీవో రాణి సుస్మిత, ఇన్చార్జి డీ ఎస్ వో ఎస్ భాస్కర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతి నిధులు, పౌర సరఫరాల, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ముందు తల్లిని చెల్లిని పరామర్శించమనండి

**- ప్రజలకు వైసీపీ పార్టీ గుర్తు చేయడానికే శవ రాజకీయాలు చేస్తున్న జగన్**

**జగన్ చీటీ చినిగిపోయింది**

**- మంత్రి సవిత**

**సోమందేపల్లి:** రాష్ట్రంలో జగన్ పని అయిపోయిందని , పార్టీ ఉనికి కోసమే శవ రాజకీయాలు చేస్తున్నారని పులివెందుల ఎమ్మెల్యే జగన్ పై మంత్రి సవిత ఫైరయ్యారు. సోమందేపల్లి మండల కేంద్రంలోని చెరువు సమీపంలో హంద్రీ-నీవా కాలువ తెగిపోయిన విషయం తెలిసిందే,ఆ కాలువ మరమ్మత్తు పనులు పూర్తి అయిన సందర్భంగా శనివారం కాలువను పరిశీలించిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత.. రైతులకు ఇబ్బందులు కలగకుండా,వారి పంటలకు నీరు అందించండి అని నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు.

అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి హయంలోనే ఫ్యాక్షన్ రాజ్యం జరిగిందని,తన అక్కను ఇబ్బంది పెడుతుంటే అడ్డుకున్న ఓ చిన్నారిని పెట్రోల్ పోసి చంపిన ఘనత మీది కాదా? డాక్టర్ సుధాకర్ ని పిచ్చోడిని చేసింది మీరు కాదా? కారు డ్రైవర్ ను చంపి డోర్ డెలివరి చేసింది మీరు కాదా ? మహిళలపై మానభంగాలు, హత్యలు చేసింది మీరు కాదా? అంటు వైసీపీ మీద నిప్పులు చెరిగారు.

జగన్ అనంతకు పరామర్శ పేరుతో రావడం ఓ నాటకమని, జగన్ కు చిత్త శుద్ధి ఉంటే ముందు తన తల్లిని,చెల్లి షర్మిలను పరామర్శించాలని, వైసిపి



హయాంలో హత్యలకు గురి అయిన వారి కుటుంబాలను పరామర్శించాలని, తమ మాన ప్రాణాలు కోల్పోయిన మహిళ కుటుంబాలను ఓదార్చాలని, తన సొంతం బాబాయి హత్యకు కారణమైన వారు ఎవరో తెలుసుకోవాలన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక రామ రాజ్యం వచ్చిందని, జగనాసురుడి కథ ముగిసిందన్నారు. జగన్ ఎన్ని జిమ్మిక్కులు చేసిన, ఎన్ని నాటకాలు ఆడినా వైసిపి పని అయిపోయింది. ప్రజలు జగన్ చీటిని చింపేశారని మంత్రి సవిత అన్నారు.

## ముస్లింల సంక్షేమాన్ని పట్టించుకోని కాంగ్రెస్!

**- సోనియాపై నిప్పులు చెరిగిన పురంధేశ్వరి**

**విజయవాడ, మహానాడు:**

వక్ఫ్‌బిల్లు వ్యవహారంలో కాంగ్రెస్ అవాకులు చవా కులు పేలితే వైసీపీ లోక్‌సభలో ఒక విధంగా రాజ్యసభ లో ఒక విధంగా వ్యవహరించాయని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తూర్పారబట్టారు.

ఈ మేరకు ఆమె శనివారం ఇక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయం లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. వక్ఫ్ బిల్లు విషయంలో సోనియా వ్యాఖ్యలను పురంధేశ్వరి తిప్పికొట్టారు. సరైన చర్చ జరగకుండా ఈ చట్టం చేశారని సోనియా బీజేపీపై అపవాదు వేయడం తగదన్నారు.

ఈ చర్చ జరిగినప్పుడు రాహుల్, ప్రియాంక సభలో ఉన్నారా అంటూ ప్రశ్నించారు. అన్నిపార్టీలకు చెందిన నాయకులు అభిప్రాయాలు చెప్పాక పార్లమెంట్‌లో తెల్లవారుజామున మూడు గంటలకు బిల్లు ఆమోదం పొందింది.

రాజ్యసభలో మరునాడు తెల్లవారుజామున నాలుగు గంటలకు బిల్లు ఆమోదం పొందింది. వారు సభలో లేకుండా వీటిపై అభిప్రాయాలను ఎలా వ్యక్తం చేశారని తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. అసాధ్యాన్ని సుసాధ్యాన్ని చేసే నాయకత్వం బీజేపీకి ఉందని పురందేశ్వరి తెలిపారు.




ముస్లింల గురించి అందరూ మాట్లాడటమే తప్పు.. వారి క్షేమం కోసం చేసిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీదేనని ఆమె అన్నారు. 2013 సంవత్సరంలో ఎన్ని కలకు కొన్న నెలలు ముందు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ యాక్ట్ ను సవరణ చేసింది. మైనారిటీ బోర్డును డైల్యూట్ చేసి.. కావాల్సిన వారు బోర్డులు పెట్టుకోవచ్చుని మైనారిటీల్లో విభజన తెచ్చారు. ఇదే కాంగ్రెస్ ద్వంద్వ నీతి అని ఆమె విమర్శించారు.

## సామాజిక సమానత్వం కోసం పోరాడిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్

**పొన్నూరు, మహానాడు:** భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా పట్టణంలోని బాబు జగ్జీవన్ రాయ్ విగ్రహానికి సీపీఐ నాయకులు పూలమాలు వేసి



ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పాల్గొన్నారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శనేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. దేశానికి ఆయన చేసిన సేవలు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషిచేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరం కృషిచేద్దా అని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి.రాధాకృష్ణమూర్తి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, పల్నాడు జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆకిటి అరుణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, నాయకులు దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


## పంచెకు గ్లాసుకోల్ పంచెకు తేడా ఏమిటి?



అవి గ్లాసుకోల్ లేదా గ్లాస్కో లేదా గ్లాక్సో కాదు, వాటిని Glasgow పంచెలు అంటారు, గ్లాస్గో అనేది ఇప్పటి స్కాట్లాండ్ లో ముఖ్య నగరం, United Kingdom లేదా బ్రిటన్ లో భాగమైన ఈ నగరం దాదాపు లండన్ సిటీ కి పోటీగా అభివృద్ధి చెందినది, ఇంగ్లండ్ లో ఉన్న మూడు పెద్ద నగరాల్లో ఒకటిగా ఫ్యాషన్ వస్త్రాలకు ఖ్యాతి గాంచింది

గ్లాస్గో అనేది ఒక బ్రాండ్.. బొంబాయి రవ్వ, కరాచీ బేకరి, బందరు లడ్డు, కాకినాడ కాజా, హైదరాబాద్ బిర్యానీ లాగ !

భారత దేశాన్ని బ్రిటీషు వారు పరిపాలించే కాలంలో ఇక్కడి నుంచి ముడి పత్తి ని నౌకల్లో ఇంగ్లండ్ కు ఎగుమతి చేసి, అక్కడి ఆధునిక బట్టల మిల్లుల్లో దాన్ని ప్రాసెస్ చేసి ఫైన్ వెరైటీ క్లాత్ గా మార్చే వారు, ఇండియా నుంచి దిగుమతి చేసుకున్న పత్తే చాలా నాణ్యమైనది అయినందున దాని నుంచి తయారైన వస్త్రం చాలా పల్చగా నాజూకుగా ఉండేది



మనదేశంలో అప్పుడు చేనేత వారు నేసిన ముతక వస్త్రాలనే ధరించేవారు, 1760 నుంచి 1840 వరకూ చరిత్రలో తొలి పారిశ్రామిక విప్లవం సాగినట్టు భావిస్తారు, అందులో భాగంగా ఇంగ్లండ్ లో లండన్, మాంచెస్టర్, గ్లాస్గో లలో ఫ్యాక్టరీలు, భారీ యంత్ర సామగ్రితో కూడిన ఉత్పత్తి కేంద్రాలు వచ్చాయి, వాటిలో తయారైనదే గ్లాస్గో క్లాత్.

భారత దేశంలో సంప్రదాయ పరంగా పంచె కట్టు లేదా ధోతీ ధరించడం గమనించిన బ్రిటిష్ వస్త్ర వ్యాపారులు అదే వస్త్రాన్ని ఎగుమతి చేసే వారు!

మనదేశంలో అప్పటికి బట్టల మిల్లులు లేవు, అందుచేత గ్లాస్గో లో తయారైన అతి పలచన, %తీఝఅంజూఝతీవత్% వస్త్రానికి అధిక డిమాండ్ ఉండేది, వీటిని కట్టుకోవడం సమాజంలో హోదాకు చిహ్నా మైనం దున అప్పటి సంపన్న వర్గాలు అనగా జమీందారులు, భూస్వాములు మాత్రమే కొనగలిగే వారు.

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా గాంధీజీ పిలుపు ఇచ్చిన విదేశీ వస్తు బహిష్కరణలో ఈ Glasgow cloth కూడా ఉంది, స్వదేశీ ఉద్యమ కారులు ఈ వస్త్రాన్ని వీధుల్లో గుట్టలుగా పోసి దహనం చేసి బ్రిటిష్ వారికి తమ నిరసన తెలిపారు, దేశ స్వాతంత్ర్యం ముందే మనదేశంలో బ్రిటిష్ Textile knowledgeతో బొంబాయి , సూరత్, అహ్మదాబాద్ లలో textile మిల్స్ వచ్చాయి, వాటిలో కూడా ఈ Glasgow వస్త్రాన్ని లేదా కొలతల ప్రకారం పంచెల్ని తయారు చేసే వారు

క్ర మేణా ఈ పంచెలకు గ్లాస్గో పేరే స్థిర పడింది, ఇప్పటికీ అదే కొనసాగు తోంది, ఇప్పుడు ధనికులే కాదు, సామాన్యులు కూడా ఈ వస్త్రాన్ని కొనగలరు, పంచెలుగానే కాక చొక్కాలు, లాల్చీలుగా కూడా దీన్ని కుట్టించు కుంటారు, పూర్వం రోజుల్లో ఇంటి అల్లుళ్ళకు , పెద్దలకు గ్లాస్గో పంచెలు పెట్టడం , చొక్కాలకు సరిపడ వస్త్రం యిచ్చి గౌరవించడం ఉండేది, టెర్లిన్, టెరి కాటన్, పాలియేస్టర్, స్పన్ వగైరా వస్త్రాలు రాకముందు ప్రీమియం క్లాత్‌గా గ్లాస్గో వస్త్రం వెలిగిపోయింది!



చేనేత పంచెల్లో నూరో నంబరు పంచెలు, అంచు పంచెలు, పెదరాయుడు పంచెలు, ఖద్దరు పంచెలు అని చాలా వెరైటీలు ఉంటాయి, వాటికి భిన్నంగా గ్లాస్గో పంచెలు రిచ్‌గా కనబడతాయి, ప్రస్తుతం పంచెలు కట్టుకుని తిరిగే తరం నెమ్మదిగా అంతరిస్తోంది!

**- వైవిఆర్**

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 06, ఏప్రిల్ 2025



మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్‌రామ్ వారి 117వ జయంతిని పురస్కరించుకుని స్థానిక 14వ డివిజన్‌లోని శారదా నగర్ వాటర్ ట్యాంకుల వద్ద రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ వారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

## బాబు సీఎం అయ్యాకే గ్రామాలకు రోడ్లు

**- ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం.**

**- పరిగి మండలంలో 3 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన మంత్రి సవిత**



**పరిగి:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9నెలల లోపే ముఖ్యమంత్రి చంద్రబాబు మార్క్ గ్రామాల్లో కనిపిస్తోందని మంత్రి సవిత అన్నారు. పెనుకొండ నియోజకవర్గం పరిగి మండలం ఫ్రైడేటి వెళ్లే రహదారిలో ముదిరెడ్డి పల్లి గ్రామంకు 1 కోటి రూపాయలతో నిర్మించిన



తారురోడ్డు ను ప్రారంభించారు. అనంతరం తిరుమలదేవర పల్లి నుండి విట్టాపల్లి గ్రామంకు 1కోటి రూపాయల నిధులతో తారు రోడ్డు నిర్మాణం కు భూమిపూజ చేశారు.

ఊటుకురు గ్రామం నుండి అక్కంపల్లి గ్రామము వరకు 1 కోటి రూపాయలు నిధులతో తారు రోడ్ నిర్మాణంకు భూమిపూజ చేసిన మంత్రి సవిత గ్రామాలకు వచ్చిన మంత్రి సవితకు నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ఎన్నికల ప్రచారంలో సవిత దృష్టికి తీసుకొచ్చారు. అధికారంలోకి రాగానే రోడ్లన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల అభివృద్ధి పై దృష్టి సారించిందని.. ఇందులో మొదటి ప్రాధాన్యత రోడ్ల నిర్మాణాలకే ఇచ్చిందన్నారు. అందుకే పెనుకొండ నియోజకవర్గంలో చాలా గ్రామాలకు రోడ్లు వచ్చాయన్నారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు పెద్ద ఎత్తున వేస్తున్నట్టు చెప్పారు. ఊటుకూరు పంచాయతీలోనే అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే 4 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని మంత్రి సవిత తెలిపారు. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు వలనే సాధ్యమవుతోందన్నారు.

## దేశానికి మార్గదర్శకుల్లో చంద్రబాబు ఒకరు

**- ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)**

**చందర్లపాడు, మహానాడు:** కాలానుగుణంగా పరిశ్రమల్లో రాబోయే మార్పులను ముందుగానే గమనించి, తన ఆలోచనల్లో 20 ఏళ్ళు ముందు వుంటూ వాటిని అందిపుచ్చుకుని అభివృద్ధి పరంగా ఒక విప్లవం తీసుకువచ్చే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశానికి మార్గదర్శకులైన నలుగురైదుగురు నాయ





కుల్లో ఒకరని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కొనియాడారు. నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ , ఎమ్మెల్యే తంగిరాలసౌమ్య, మంత్రులు వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, డోలా బాలావీరాంజనేయ స్వామి, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు.

కలెక్టర్ లక్ష్మీశ సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో బాబూ జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ నడుస్తుందన్నారు. సామాజిక న్యాయం చేయటమే సీఎం చంద్రబాబు ధ్యేయమన్నారు. అంబేద్కర్ పే బ్యాక్ సొసైటీ నినాదం స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బడుగు బలహీన వర్గాలకు ఆసరా వుండేందుకు పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.

ఏపీలోని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని తెలిపారు. తాము సీఎం చంద్రబాబు కి వారసులుగా ప్రజాసేవ చేయటాన్నిగర్వంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. వికసిత్ భారత్ 2047, స్వర్ణాంధ్ర ఏ2047 సాధనలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి అమోఘమంటూ కొనియాడారు. ప్రజల సహకారంతో స్వర్ణాంధ్ర 2047 సాధన 2035 కల్లా సాధ్యపడుతుందని, అప్పటి కల్లా ఏపీ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా మారుతుందనే నమ్మకం ఉందన్నారు.

రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హాబ్ గా చేయాలనే ఆలోచనలు, పీ4 కార్యక్రమాలతో ఏపీకి అభివృద్ధికి ఎలాంటి డోకా లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ కి ఏ బ్రాండ్ లేకపోయినా బ్రాండ్ సిబిఎన్ వుందని గర్వంగా చెప్పుకుంటామన్నారు. తెలుగుదేశం పార్టీకి నందిగామ నియోజకవర్గం బాగా కలిసొచ్చే నియోజకవర్గమన్నారు. నందిగామ నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబును ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు.

## కాకాణీ... ఏ గూట్లో దాక్కున్నావ్? ఒక్క నోటీసుకే భయపడ్డవా?

**- టీడీపీ నేతల ఎద్దేవా**

**నెల్లూరు, మహానాడు:** కాకాణీ... ఏ గూట్లో దాక్కున్నావ్? కేసులకు అదరనన్నావ్.. అరెస్టులకు బెదరనన్నావ్...ఇప్పుడు ఏమైపోయావ్? దేశంలోనే ఉన్నావా... విమానం ఎక్కి ఉడాయించావా? దుబాయ్ లో దాక్కున్నావని మీ వైసీపీ నేతలే చెబుతున్నారు.. నిజమేనా? అని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరు రాధాకృష్ణమనాయుడు, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్, గాలి రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు వారు శనివారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. అక్రమ మైనింగ్ తో వందల కోట్లు దోచేసిన నువ్వు ఫలితం





అనుభవించక తప్పదు. మీ బ్లాస్టింగుల కారణంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతికిన వరదాపురం గిరిజనుల గోస నీకు తగలక తప్పదని వారు అన్నారు. ఇంకా, వారెమన్నారంటే.. వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని కాకాణి గోవర్ధన్ రెడ్డి చెలరేగిపోయారు..సర్వేపల్లి నియోజకవర్గంలో పంచభూతాలను దోచేశారు. పొదలకూరు మండలం తాటిపర్తి రుస్తుం మైన్ లో జరిగిన అక్రమ మైనింగ్ ను అప్పటి ప్రతిపక్ష నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మీడియా సాక్షిగా ప్రజల ముందు పెట్టారు. మైనింగ్‌లో భాగంగా భారీ ఎత్తున పేలుడు పదార్థాలతో చేసిన బ్లాస్టింగ్ లతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నామని గిరిజనులు వేడుకున్నా నాటి పాలకులు పట్టించుకోలేదు. అమాయక గిరిజనుల ప్రాణాలను పణంగా పెట్టి మైనింగ్ కొనసాగించారు. ప్రశ్నించిన వారిపై తమ ప్రతాపం చూపించారు.

సోమిరెడ్డి మైన్ సందర్శించినప్పుడు రిగ్ బ్లాస్టింగ్ మిషన్, ప్రొక్లెయిన్లు, డంపర్లు, పేలుడు పదార్థాలు వెలుగులోకి వచ్చాయి. కాకాణి ఆధ్వర్యంలో జరిగిన వేలాది టన్నుల క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ పై అధికారులు చేసిన ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు.

మొన్నటి దాకా కేసులను ఎదుర్కొంటానని కాకాణి గోవర్ధన్ రెడ్డి జబ్బలు చరిచాడు..ప్రెస్ మీట్లు పెట్టి రోజుకో రీతిలో రెచ్చిపోయాడు. సింహపురి సింహాన్ని అన్ని ప్రగల్భాలు పలికాడు.. తీరా పోలీసులు నోటీసులు ఇవ్వగానే పత్తాలేకుండా పారిపోయాడు. నోటీసుకే బెదిరిపోయిన కాకాణి వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఆ పార్టీ కార్యకర్తలకు ఏం సమాధానం చెబుతాడు..? ఏం భరోసా కల్పిస్తాడు? అసలు దేశంలో ఉన్నాడా.. విదేశాలకు పారిపోయాడా.. హాంకాంగ్, సింగపూర్ లాంటి దేశాల్లో దాక్కున్నాడా?

నెల్లూరులో ఒక ఫొటో పెడతాడు..హైదరాబాద్ లో మరో ఫొటో పెడతాడు. చిక్కడు దొరకడులా మాయమైపోతాడు! కలుగులో ఎలుక దాక్కున్నట్టు దాక్కుని... అప్పుడప్పుడు బయటకు వచ్చి వాట్సాప్ లో తొంగి చూచిపోతున్నాడు. ఫొటోలు మార్ఫింగ్ చేసి తలకాయలు మార్చడం కాకాణికి మొదటి నుంచి అలవాటే..ఇప్పుడే అదే అలవాటును కొనసాగిస్తున్నట్టున్నాడు. ఒక రాజకీయ నాయకుడిగా ప్రజల్లో చెలామణి కావాలంటే వెంటనే పోలీసుల ఎదుట లొంగిపోయి కేసులను న్యాయబద్ధంగా ఎదుర్కోవాలని హితవు పలుకుతున్నాం.

కాకాణి వెంటనే కలుగులో నుంచి బయటకు రాకపోతే పోలీసులు నాదస్వరం ఊదైనా బయటకు తేవడం ఖాయం. అధికారంలో ఉన్నప్పుడు లెక్కకు మించి పాపాలు చేసి ఇప్పుడు దాక్కోవడం నాయకుడి లక్షణం కాదని కాకాణి గుర్తుంచుకోవాలి. కరోనా ప్యాలెస్‌లో ఖాళీగా కూర్చుని నిత్యం ప్రెస్‌మీట్లు పెడతాడు... పిట్టలదొర మాదిరిగా నోటి కొచ్చినట్టు అనర్గళంగా మాట్లాడుతాడు.. ఇప్పుడేమో పోలీసులు నోటీసులివ్వగానే తుస్సుమన్నాడు. కాకాణి ప్రగల్భాలు విన్న ప్రజలు ఇప్పుడు ఆయన పారిపోవడం చూసి నవ్వుకుంటున్నారు.

రాష్ట్రంలో విలువలు లేని నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది... కాకాణి గోవర్ధన్ రెడ్డి తర్వాతే.. సర్వేపల్లి నియోజకవర్గ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కాకాణి హయాంలో అనేక నేరాలు ఘోరాలు జరిగాయి.

అధికార అహంకారంతో చెలరేగిపోయాడు..అక్రమ కేసులు, ఆస్తుల విధ్వంసంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు..ఇప్పుడేమో ఒక్క కేసుకే మాయమైపోయాడు. వరదాపురం రుస్తుం మైన్‌లో అక్రమ మైనింగ్ జరగకుండానే సోమిరెడ్డి సత్యాగ్రహం చేశారా? గుమ్మడికాయల దొంగలు ఎవరంటే..వైసీపీ నాయకులు భుజాలు తడుముకుంటున్నారు. మగోడిని, మొనగాణ్ణి అనే బీరాలు పలికే కాకాణి ఇలా పారిపోతాడని మేం అనుకోలేదు. వైసీపీ పాలనలో సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణికి తెలియకుండా చీమైనా కుట్టే పరిస్థితి లేదు..అలాంటిది అక్రమ మైనింగ్ విషయం ఆయనకు తెలియదనడం హాస్యాస్పదం!



స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక విప్లవకారుడు, అణగారిన వర్గాల అభ్యున్నతికై పోరాడిన యోధుడు, సామాజిక న్యాయ ఉద్యమ సారథి భారతదేశ తొలి ఉప ప్రధాని స్వర్గీయ డా.బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా రామచంద్రపురంలో ఆ మహనీయునికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్, పాల్గొన్న కూటమి నాయకులు, ప్రజలు.



మాజీ ఉప ప్రధానమంత్రి డా.బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతిని పురస్కరించుకొని బషీర్ బాగ్ లోని ఆయన విగ్రహానికి నివాళులర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి,మాజీ ఎంపీలు వి .హనుమంత రావు, అంజన్ కుమార్ యాదవ్.





సోమందేపల్లి మండలం చల్లాపల్లి గ్రామానికి చెందిన రాజు నాయక్‌కి వైద్య ఖర్చులు నిమిత్తం 5 లక్షల రూపాయల చెక్కును రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు శ్రీమతి సవితమ్మ పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో వారికి అందించారు.



డా. బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకల సందర్భంగా అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్లోని చర్చి ఎదురుగా ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, ప్రజా ప్రతినిధులు పూలమాలాంకరణ చేసి ఘన నివాళులర్పించారు.



నెల్లూరు నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి పాల్గొన్నారు.

బషీర్‌బాగులోని భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు






హైదరాబాద్ జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్లో కనుమూరి బాపిరాజు మునిమనవరాలి వోణీల (హాఫ్ శారీ) వేడుకలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు



దెందులూరు నియోజకవర్గంలో గ్రామ గ్రామాన ఘనంగా శ్రీరామ నవమి వేడుకలకు సర్వం సిద్ధం - శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 500 రామాలయాలకు పానకం నిమిత్తం 8 టన్నుల బెల్లం కానుకగా అందించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు భారతదేశపు మొట్టమొదటి దళిత ఉప ప్రధాని డా? బాబు జగ్జీవన్ రామ్ గారి 117వ జయంతి సందర్భంగా కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు , శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖరం మహనీయుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.



గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించడం జరిగింది.

జగ్గయ్యపేట పట్టణం, స్థానిక బస్ స్టాండ్ సెంటర్ నందు బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జనసేన నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళులు అర్పించిన ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను.





## క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించిన కన్నా

**సత్తెనపల్లి, మహానాడు:** సత్తెనపల్లి పట్టణం శరభయ్య హై స్కూల్ గ్రౌండ్‌లో శనివారం సత్తెనపల్లి పోలీసులు, బార్ అసోసియేషన్ సభ్యుల మధ్య జరిగే ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే కన్నాలక్ష్మీనారాయణ ప్రారంభించారు. అలాగే మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ జయంతిలో ఎమ్మెల్యే పాల్గొని, ఆయన ఘన నివాళులు అర్పించారు.

06

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 06, ఏప్రిల్ 2025

# ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుక

### - ఘన నివాళ్లు అర్పించిన టీడీపీ నేతలు

**మంగళగిరి, మహానాడు:** పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేసిన మహనీయుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నేతలు ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ..



బడుగుల సాధికారతే లక్ష్యంగా.. దేశాభివృద్ధే ధ్యేయంగా నిరంతరం దేశ యశస్సు కోసం.. దేశ ప్రజల ఉన్నతి కోసం.. సమసమాజ స్థాపన కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన కృషి అందరికి ఆదర్శనీయమన్నారు. ఇటువంటి గొప్ప నేతల ఆలోచనలు ఆశయాలను నేటి నాయకులు, యువత ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికోసం.. సమసమాజ స్థాపన కోసం కృషి చేయాలన్నారు.

నాడు తనతో 198 మంది పార్లమెంట్ సభ్యులు ఉన్నారని.. తనకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వమని బాబూ జగ్జీనవ్ రామ్ కోరితే.. ఆనాడు అధికారంలో ఉన్న పార్టీతో పాటు నాడు రాజకీయంలో ఉన్న "దుష్టచతుష్టయం" దళితులపై వారి అహంకారాన్ని చూపారని.. అందుకే కాంగ్రెస్ లో దళితులకు న్యాయం జరగదని భావించిన జగ్జీవన్ రామ్ జనతాపార్టీలోకి వెళ్లి దేశ ఉప ప్రధాని అయ్యారని వర్లరామయ్య తెలిపారు.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో ఉన్న అంటరాని తనం అస్పృశ్యతను దూరం చేసి.. హెూటల్స్ లో ఉన్న రెండు గ్లాసుల సిద్ధాంతాన్నితొలగించారన్నారు. దేవాలయాల్లో దళితులకు ప్రవేశాన్ని కల్పించారన్నారు. జస్టిస్ పున్నయ్య సూచించిన అంశాలను క్యాబినేట్ లో పెట్టి దళితులకు మేలు చేశారని కొనియాడారు. దళిత బిడ్డ బాలయోగి(మాల) లోక్ సభ స్పీకర్ ను చేశారన్నారు. అలాగే మరో దళిత బిడ్డ కే ఆర్ నారాయణన్ రాష్ట్రపతి అవ్వడానికి చంద్రబాబు సహకారం అందించారన్నారు.

శాసన సభ అధ్యక్షురాలిగా ప్రతిభా భారతి, మొట్టమొదటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాకి మాధవరావులను నియమించి దళితులను అగ్రస్థానంలో ఉంచిన గొప్ప వ్యక్తి చంద్రబాబు అన్నారు. సుప్రీం తీర్పు వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపి రాష్ట్రంలో దళితులకు సమన్యాయం చేసిన దళిత బాంధవుడు చంద్రబాబు అన్నారు. ఇటువంటి దళిత పక్షపాతి అయిన చంద్రబాబు వెంట ఎస్సీలందరూ నడిచి టీడీపీకీ వెన్నుదన్నుగా ఉండాలని.. బడుగు బలహీన వర్గాలకోసం బాబూ జగ్గీవన్ రామ్ కలలను నిజం చేస్తున్న టీడీపీతో కలిసి నడవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ మంత్రి పీతల సుజాత, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ శిరీష, రాష్ట్ర కార్యదర్శి జగదీశ్ బాబు, ఎస్సీ నేతలు చిలక బసవయ్య, యర్రం రామారావు, ఆలూరి రాజేష్, పేరుపోగు రాజేష్, వల్లూరి కిరణ్, ఆదాం, మైనర్ బాబు, మందా మోహన్, మీడియా కోఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

# 30 వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే లక్ష్యం

**80 వేల సంఘాలకు రూ. 8వేల కోట్ల రుణాలను అందించాలన్నదే ధ్యేయం**

**సీఎం ఆదేశాలతో మెప్మా సిబ్బందికి హెచ్ఆర్ఎంఎస్ రూపొందిస్తున్నాం**

**మెప్మాలో ఖాళీలు త్వరలో భర్తీ చేస్తాం**

**ఈ-కామర్స్ పాలసీని రూపొందిస్తాం: మంత్రి నారాయణ వెల్లడి**




**విజయవాడ, మహానాడు:** ఈ ఆర్థిక సంవత్సరంలో 30వేల మందికి పైగా మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రానున్న మూడేళ్లలో లక్ష మందికి పైగా మహిళా పారిశ్రామికవేత్తలను అభివృద్ధి చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. విజయవాడ లోని ఓ ప్రైవేటు కన్వేన్షన్ లో మహిళా వ్యాపారాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికపై ఒక రోజు వర్క్ షాపును మంత్రి నారాయణ శనివారం ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఒక్క రోజులో అత్యధిక ఎస్ హెచ్ జీ ఉత్పత్తులు ఆన్లైన్ ద్వారా అమ్మి గిన్నిస్ రికార్డు, మూడు వరల్డ్ రికార్డు యూనియన్ ద్వారా ప్రపంచ రికార్డులు సాధించినందుకు ప్రతి ఒక్కరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కేవలం మూడు నెలల్లోనే ఎస్ హెచ్ జీ ప్రొఫైలింగ్ ను పూర్తిచేసి పట్టణాల్లోని సంఘాల సమగ్ర సమాచారం ఆన్లైన్ చేయడం అభినందనీయమన్నారు.

ఈ ఏడాది కనీసం 80వేల సంఘాలకు రూ. 8వేల కోట్ల రుణాలను బ్యాంకు లింకేజీ ద్వారా పట్టణ పేద కుటుంబాలకు అందించాలని మెప్మా సిబ్బందికి మంత్రి నారాయణ ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల ద్వారా లక్ష మందికి లబ్ధినందించాలన్నారు. స్వయం సహాయక సంఘ మహిళల 20వేల ఉత్పత్తులను ఈ-కామర్స్ లో అన్బోర్డ్ చేసి ఈ ఏడాది రూ. 10వేల కోట్ల విలువైన విక్రయాలు జరపాలని లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నట్టు పేర్కొన్నారు.

మెప్మా లో ఖాళీలను త్వరలో పూర్తి చేస్తామన్నారు. మెప్మా సిబ్బందికి ముఖ్యమంత్రి హెచ్ఆర్ పాలసీని ఇచ్చారన్నారు. ఇప్పుడు మెప్మా సిబ్బందికి హెచ్ఆర్ఎంఎస్ ను రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాలలో సుయోగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి సింగల్ విండో సిస్టం ద్వారా కేంద్ర, రాష్ట్ర పథకాలు పట్టణ పేదలకు అందించాలన్నారు. మెప్మాలో అన్ని విభాగాలలో డిజిటల్ ఇనిషియేటివ్ ల ద్వారా పారదర్శకత పెంచేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. మెప్మా లో ఈ-కామర్స్ పాలసీని రూపొందించి తద్వారా మన ఉత్పత్తులను దేశ, ప్రపంచ వ్యాప్తంగా విస్తృత మార్కెట్ కల్పించాలన్నారు.

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి చెప్పిన విధంగా విజన్-2047 లో పేదరిక నిర్మూలన ఒక అంశమని, అలాగే ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త ఉండేలన్నదే లక్ష్యమని మెప్మా సిబ్బంది తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ఒక ఏడాదిలో 30 వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చేయడం మన లక్ష్యమని, అయితే అదనంగా మరో 20 వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలన్న లక్ష్యంగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

మహిళా పారిశ్రామికవేత్తల వార్షిక టర్నోవర్ రూ. కోటి కి పైగా ఉండాలా వారిని ప్రోత్సహించాలని, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అసంఘటిత కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ లిట్రసీ, ఫైనాన్షియల్ లిట్రసీ పై అవగాహన పెంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

అనంతరం స్వయం సహాయక సంఘ మహిళల కోసం మెప్మా అధికారిక వెబ్ సైట్, మహిళాకాశం యాప్, పట్టణ నిరాశ్రయుల వసతి గృహం కోసం నివాసం యాప్, సంఘాలలోని సదుపాయం కోసం మెప్మా లోన్ ఛార్జ్ క్రియేషన్ మెకానిజం, మెప్మా సిబ్బంది కొరకు హెచ్ఆర్ఎంఎస్ డాష్ బోర్డ్ ను మంత్రి నారాయణ ప్రారంభించారు. అలాగే అసంఘటిత కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఈ-శ్రమ్ పథకంతో అనుసంధానం చేస్తూ వారికి ఆర్థిక భద్రత కల్పించేందుకు గాను మెప్మా, కార్మిక శాఖ మధ్య అవగాహన ఒప్పందం(ఎంఓయూ) చేసుకున్నారు. ఎస్సీ లబ్ధిదారులకు మార్చి 2025, బ్యాంకు లింకేజీ రుణం రూ. 143.55 కోట్లు, పీఎం స్వానిధి రుణం రూ. 2.21 కోట్లు చెక్ లను మంత్రి నారాయణ చేతుల మీదుగా అందచేశారు. అత్యుత్తమ ప్రతిభ కలిగిన ఎస్సీ మహిళా వ్యాపారవేత్తలకు ప్రశంసాపత్రాలు, ఎక్స్ లెన్స్ సర్టిఫికెట్లను అందచేశారు.

కార్యక్రమంలో కార్మిక శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎం.వి. శేషగిరి బాబు, మెప్మా మిషన్ డైరక్టర్ ఎన్. తేజ్ భరత్, ఏడీ ఐ. మాధవి, ఉన్నతాధికారులు, ప్రాజెక్ట్ డైరక్టర్లు, స్వయం సహాయక మహిళలు, స్టేట్ మిషన్ మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుంటనక్కల తీర్మానం!

అదొక కంచె. గచ్చిబౌలి కంచె. పేరుకే కంచెకని పెద్ద అడివే. నెమళు జింకలు దుప్పులు కుందేల్లు ఉడతలు,సహా పూర బిష్కలు, చిల్కలు, గోరెంకలు, బుర్కపిట్టలు ఇట్లా పేరొక్క జంతువు పక్షులకు ఆవాసం.

వీటితో పాటు గుంటనక్కలకు తోడేల్లు విషపు పాములు, గుడ్ల గూబలకు కూడా ఇంత నీడనిచ్చి బతికే అవకాశమిస్తున్నదా కంచె.

సకల జీవరాసులను తనలో దాసుకున్న నీలి సముద్రం మాదిరి ఆకుపచ్చని సంద్రంలా హైద్రాబాద్ కాంక్రీట్ జంగల్ నడుమ నిలిచింది.

ఇందులో అనేక రకాల పండ్ల చెట్లు నీడనిచ్చే చెట్లు మహావృక్షాలు ఆకాశం వైపు గర్వంగా చూస్తూ తరాలుగా పెరుగుతూ వస్తున్నాయి.

అట్లా మంచీ చెడుల కలయిక జీవ వైవిధ్యంతో కూడిన ఒక వసుధైక కుటుంబ భావనతో ప్రతి జీవరాశిని తన బిడ్డ లాగానే భావించుకున్నది కంచే. తన బిడ్డలకు తన చెట్ల నీడతో చల్లని గూడును పండ్లుఫలాలు గడ్డలతో పారే సెలయేర్లు కుంటలతో కడుపునిండా తిండి కంటినిండా కునుకు అన్నట్టు సుఖ సంతోషాలతో సాగుతున్నవి అడవి జీవాల జీవితాలు.

తన పచ్చదనం చూసి వోర్వలేని బడా దళారులు ఇరవయేండ్లనుంచి తన వెంటపడుతూనే వున్నరు. వలసపాలకుల హయాం నుంచి తన మీద రియలెస్టేట్ బ్రోకర్లు దళారుల కన్నుపడుతూనే వున్నది. వాటన్నిటినుంచి గచ్చిబౌలిలో 400 ఎకరాల్లో పచ్చగా విస్తరించి ప్రాణవాయువునిచ్చే తనను కాపాడుకునేందుకు ఎంతో మంది పర్యావరణ ప్రేమికులు ఆధర్మమూర్తులు ముందుకు వచ్చారు.

తమమీద ఈగవాలకుండా న్యాయ స్థానాలు రక్షణ కవచంగా నిలిచినయి. తననేమీ చేయొద్దని కోర్టు స్టే కూడా విధించింది.

అటుతర్వాత వచ్చిన తొలి తెలంగాణ ప్రభుత్వం తనను కబ్జాదారుల కోరలకు చిక్కకుండా కంచెవేసి రక్షణ గా నిలిచింది. వారితో పాటు తనకు ఏ కష్టమొచ్చినా అండగా నిలిచిన హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు తనకు సైనికుల్లా 24 గంటలు పహారాకాస్తున్నరు. ఇటువంటి శత్రు దుర్భేద్య వాతావరణంలో పచ్చగా ఫరిఢవిల్లుతూ లోకానికి ప్రాణవాయువును ప్రసారం చేస్తున్నది గచ్చిబౌలి కంచె

తాను పుట్టిన కానించి ఎటువంటి కష్టం లేకుండా సుఖంగా సంతోషంగా బతుకుతున్నది .

ఇటువంటి సందర్భంలో వొకానొక అర్థరాత్రి తమపాలిటి కాల రాత్రిగా మారింది. ఆరోజు.. సెలవు దినం. వారమంతా అలసిపోయిన అడవి బిడ్డలు, వీకెండ్ సెలబ్రేషన్లు జరుపుకుని తమ గూల్లకు చేరుకున్నయి. ఆనందంలో అలసి సొలసిన నెమలులు జింకలు దుప్పులు గాడ నిద్రలో ఉన్నాయి.

ఒక్కసారిగా పెలపెలపెల సప్పులతో మహావృక్షాలు కూలిపోవడం మొదలైంది. భూకంపం వచ్చిందా అని చూస్తూ భూమి కదులుతలేదు, కానీ చెట్లు కూలుతున్నయి,. ఆదమరిచిపన్న జింకలు కుందేల్లు తేరుకునే లోపే వొక మహావృక్షం వచ్చి మూగజీవైన దుప్పిమీద అమాంతం కూలింది. మరుక్షణమే ప్రాణాలిడించి.

సునామీ భూకంపం వంటి ప్రకృతి వైపరీత్యాలన్నా చెప్పి వస్తయి కానీ ప్రభుత్వం వొక పథకం ప్రకారం తెచ్చిన వైపరీత్యం క్షణాలల్లో చుట్టుముట్టింది. అది ప్రకృతి సృష్టించిన భూకంపం కాదు..బుల్డోజర్లతో ప్రభుత్వం సృష్టించిన భూకంపానికి చిక్కిందనే సంగతి అర్థమవ్వడానికి కొన్ని గంటలు పట్టింది అమాయకపు అడవి జంతువులకు.

400 వందల ఎకరాల్లో విస్తరించిన కంచె అంతా నెమళ్ళ హాహాకారాలు.

ఇటీవల హైడ్రా కూల్చివేతల్లో తమ గూడు కోల్పోతున్నమని అభాగ్యులైన వో దళిత దంపతులు... అన్నా కేసీఆరన్నా..రావే ఎక్కడున్నవే... రావే...అంటూ చేసిన ఆర్తనాదాలను తలపిస్తున్నవి.

భూకంపంలో చిక్కుకున్న చిన్నారులు మహిళలు అసహాయుల మాదిరి తమను రక్షించమని వేడుకుంటున్నట్టుగా నెమల్ల కావు కావు రోదనలు.. సమస్త జీవరాసుల ఆర్తనాదాలు.

ప్రపంచ పటంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం గా పేరుగాంచిన హైద్రాబాద్ మహానగరంలో మూగజీవాల రోదనలు.. వొక ప్రకృతి వైపరీత్యాన్ని మించిపోయినవి.

కంచెను ఆక్రమించుకునేందుకు పచ్చదనాన్ని చిద్రం చేస్తూ అడవి జంతువుల వేటలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో వందలాది బుల్డోజర్ల పదగట్టనలు..ప్రపంచ యుద్ధాన్ని తలపిస్తున్నది. బుల్డోజర్ల కింద చిన్నా చితక జీవరాసులు నలిగిపోతూ ప్రాణాలు విడుస్తున్నవి.

అది ప్రకృతి తెచ్చిన భూకంపం కాదని ప్రభుత్వం తెచ్చిన బుల్డోజర్ కంపమనే సంగతి వాటికి అర్థమయ్యేలోపే జరగరాని ఘోరాలు జరిగి పోతున్నయి. నిటారుగా పెరిగిన మద్ది చెట్టును రెండు బుల్డోజర్లు వొకే సారి తమ బలాన్నంతా చూయించి కూల్చేయబోతుంటే.. ఆ చెట్టు మీద గూటిలో పండుకున్న రామచిలక ఒకసారిగా దిగ్గున లేచి తన పిల్లలను చంకన పెట్టుకొని పరిగెత్తింది.

చిటారు కొమ్మన పడుకున్నది వొక బుల్లి ఉడత. కూర్చున్న కొమ్మను నరికేసుకునే మూరు?ల చేతిలో తను పడుకున్న కొమ్మ నరికివేతకు గురవుతున్నదని అర్థమై...తేరుకునేలోపే ఆ చెట్టు వేగంగా పెద్ద శబ్దంతో భూమి మీదికి కూలింది. తప్పించుకోవాలని చూసింది కానీ అప్పటికే సమయం మించిపోయింది. చెట్టుకింద నలిగి చిధ్రమైంది బుల్లి ఉడత బతుకు.

వొకదాని వెంట వొకటన్నట్టుగా సైనికుల దండయాత్ర మాదిరి వందలాది బుల్డోజర్లు భయంకర శబ్ధాలు చేస్తూ పొగలు కక్కుతూ కంచెను సర్వనాశనం చేస్తున్నవి. మూగజీవాలన్నీ చెట్టుకొకటి పుట్టకొకటి అన్నట్టుగా.. హాహాకారాలు చేసుకుంటూ పరిగెడుతుంటే ఎటువైపు నుంచి ఏమొస్తుందో తెలువని కటిక చీకటిలో భయంకరపరిస్థితి.

అట్లాంటి యుద్ధవాతావారణంలో కంచె అంతటా ఆహాకారాలు ఉదృతమయ్యాయి. భూకంపాన్ని సృష్టించేంత శక్తివంతమైన బుల్డోజర్లు




తమ పిచ్చుక ప్రాణాల మీద బ్రహ్మాస్త్రాలు విసురుతుంటే నిసహాయ స్థితిలో ప్రణాలు విడవడం తప్ప మూగజీవాలకు వేరే మార్గం దొరకకుంటా పోయింది. తమనెవరూ ఆదుకునే వారు లేరా..? మా ప్రాణాలు మా బిడ్డల ప్రాణాలు ఇట్లనే గాల్లో కలిసిపోవాల్సిందేనా.? బుల్డోజర్ల కింద నలిగిపోవాల్సిందేనా..? అని ఆ నెమల్లు పక్షులు, జింకలు చేస్తున్న హాహాకారాలు పక్కనే ఉన్న హైద్రాబాద్ విశ్వవిద్యాలయ విద్యార్థుల చెవుల్లో పడింది. పొద్దునలేస్తే తాము కలిసి ఆడుకునే తమ అడవి జీవాల సహచరులకు ఏదో ఆపద జరుగుతున్నదని గ్రహించిన విద్యార్థులు ఆందోళనలో తమ నేస్తాలను రక్షించడానికి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు.

అప్పటికే బల్‌బల్ తెల్లారుతున్నది.

మూగజీవాలను కనిపెట్టుకుంటా కలిసి తిరిగే గుంటనక్కలు ఎందుకో ఈ బుల్డోజర్లు వచ్చేకంటే వొకరోజు ముందునుంచే కంచెలో కనిపించ కుండా మాయమై పోయినై. ఇప్పటివరకు వాటి జాడలేదు.

పేద దేశాల మీద పడిన సామ్రాజ్యవాద దేశాల సైనికుల్లాగా మహా వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరుక్కుంటూ దూసుకొస్తున్న బుల్డోజర్లకు అడ్డంగా పడుకున్నారు వన్యప్రాణి నేస్తాలయిన హెచ్సీయూ విద్యార్థులు.. తమను చంపినంకనే చెట్లను పెకిలించమని.

కోల్పోయిన తమ ఆత్మ విశ్వాసం స్థానంలో తమకంటూ ఆదుకునే వారొకరున్నారనే భరోసాను విద్యార్థులు కల్పించారు..పచ్చని చెట్లకు.

అందుకు వారికి వొక్కో చెట్టూ పక్షీ జంతువూ వారికి ధన్యవాదాలు తెలిపింది. ఒకవైపు బుల్డోజర్లు తమ గూల్లను చెదరగొడుతూ, తమ ప్రాణాలను తీసేస్తుంటే తమను రక్షించడానికి తమ నేస్తాలైన విద్యార్థులు పద్మవ్యూహంలో అభిమన్యుని మాదిరి పోరాటం చేస్తున్నార. మరోవైపు వారికి సంఘీభావంగా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ వారితో పాటు ఇతర వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు తెలంగాణ సమాజం మద్దుతు రోజు రోజుకూ పెరుగుతోంది.

ఇటువంటి యుద్ధ పరిస్థితుల్లో మూగజీవాలను ఆదుకోవడానికి న్యాయస్థానాలు కూడా ముందుకు వచ్చాయి. తాము తిరిగి తీర్పునిచ్చే వరకు బుల్డోజర్లతో తవ్వకాలు నిలిపివేయాని ఉత్తర్వులివ్వడంతో కాసింత ఊపిరి పీల్చుకున్నాయి అడవి జంతువులు.

ఇటువంటి సంధికాల పరిస్థితిలో... వొక ఉదయం నాలుగు గుంట నక్కలు గుంపుగా వచ్చాయి. అప్పటికే చనిపోయిన తమ సహచరుల అంత్యక్రియలను జరిపి, గాయాలపాలైన వారికి చికిత్స చేసుకుని కొంచెం తెప్పరిల్లుతున్న సమయంలో.. కంచెలోని జీవాలన్నీ రచ్చబండకాడికి రావాల్నయా హెూ...వొక ముఖ్యమైన అంశం మాట్లాడాల్నయా హెూ...మనకింత కష్టాలు రావడానికి మన ప్రాణాలు పోవడానికి అసలు కారకులెవరో తెలిసిపోయిందట... అదే అంశం గురించి చర్చించాల్నట.. అడవి పెద్దమనుషులైన గుంటనక్కల ఫర్మానాయా హెూ...అని దప్పు సాటింపు వేయించినాయి ఆ గుంట నక్కలు.

ఈ నక్కలు తమకోసం ఏదో మంచి పనే చేస్తున్నాయని నమ్మిన కంచెలోని బతికి వున్న జీవాలు, గాయాలపాలైన నెమల్లు వొక్కొక్కటి కదిలినయి రచ్చబండ కాడికి. విందాం అని బాధ్యతతో వచ్చిన ప్రాణులు



అన్నీ గచ్చిబౌలి కంచెలో రచ్చబండ కాడ జమైనయి.

ముందుగాలనే అన్నీ ప్రిపేరయి వచ్చిన గుంటనక్కలు...ఆరోజు పొద్దున తెలుగు పేపర్లు

ఇంగ్లీషు పేపర్లు సెల్‌ఫోన్లు అన్నీటిని ఎమ్మటి తెచ్చుకున్నయి. అమాయకపు అడవి జంతువులను నమ్మించడానికి తాము ఏమ్మాట్లాడాల్నో తమ అస్థాన మీడియా ఎడిటర్లు యాజమాన్యాలు రాసిచ్చిన స్క్రిప్టులను సిద్దంగా వుంచుకున్నయి. సమాచారాన్ని సేకరించుకుని సిద్ధంగా వున్నయి. "అందరూ వచ్చారా..?" అంటూ వొక పెద్ద గుంటనక్క అడిగింది కాలు మీద కాలేసుకుని కూసుంటూ.

"వచ్చినం అయ్యా..? అని సమాధానమిచ్చాయి అడవిలోని జంతువులు.

మన ప్రాణాలు పోయే పరిస్థితిని తీసుకువచ్చి మనకింతటి కష్టాలను తెచ్చిన అసలు దోషి ఎవరో మీకు చెప్పాలని, మీకు అసలు విషయం చెప్తామనే ఈ మీటింగు. అని ఆ పెద్ద గుంటనక్క చెప్పింది.

ఎవరు ఎవరూ వాల్లు... త్వరగా చెప్పండి...అంటూ ఆత్రుతగా అమాయకపు జంతువులు అడగసాగాయి.

ఆగండాగండి....చెప్తాం చెప్తాం....పూర్తి సమాచారంతోనే వచ్చాం.. అంటూ రెండో గుంటనక్క లేచింది. ముందస్తు ప్రిపరేషన్ ప్రకారం.

చెప్పండి చెప్పండి అంటూ అరుస్తున్నాయి అడవి జీవాలు.

చెప్తాం అయితే వొక కండిషను.

ఏంటి..?

మనకింతటి కష్టాలకు కారణమైన వారెరవరో చెప్తాం...మరి వారిని యేం చేద్దాం...వారికి ఎలాంటి శిక్షవేద్దాం...? అంటూ మూడో గుంటనక్క లేచింది.



వెంటనే నాలుగో గుంటనక్కలేచి,,,,ఏం చేయడమేంటి మన ప్రాణాలు పోవడానికి కారణమైన వారిని నరికేయడమే....ఏమంటారు...? అని అనగానే అక్కడే వున్న వూసరవెల్లులు తొడేల్లు గుంట నక్కలతో గొంతు కలిపి ..నిజ నిర్థారణ చేసి...నరికేయడమే...అంటూ జంతువుల గుంపులో చేరి గొంతు కలిపినయి.

అట్లా తాము కుట్రపూరితంగా చేసే నిజనిర్థారణలో నేరస్థులుగా తేలిన వారిని నరికేయాలనే వొక అంగీకారానికి వచ్చినయి.

నాతోటి సహెూదరులారా.. జాగ్రత్తగా వినండి. మన పూర్వీకులయిన గుంటనక్కలు తొడేల్లు వూసరవెల్లులు వాటితో పాటు కుందేల్లు జింకలు దుప్పులు ఉడతలు ఇట్లా సమస్త సహచర జంతువులు నెమ్మలు పావురాలు పిట్టలు వంటి సహచర పక్షులు.. ఇటు పక్కన్నే వున్న అడవుల్లో సుఖంగా జీవించే వారు. కానీ 19 ఏండ్ల క్రితం ఈ కంచె గచ్చిబౌలి భూమిలో మనం నివాసముంటున్న చెట్లు చిన్న చిన్న మొక్కలుగా వచ్చి నాటుకున్నాయి. ఈ 400 ఎకరాలు కోర్టు కేసుల్లో వుందనీ తెలిసే అక్రమంగా వచ్చి చేరాయి. ఇవ్వాల మహావృక్షాలైన ఈ వేపచెట్టు మద్దిచెట్టు మర్రి చెట్టు ఇట్లా మనం నివాసముంటున్న చెట్లన్నీ అవి ఏపుగా పెరగడం వల్లనే మనం వచ్చి ఇక్కడ జీవిస్తున్నాము...అవునా కాదా..?

అవును అవును... అంటూ గుంట నక్కలు తొడేల్లు వూసరవెల్లులు ముందుగా అందుకుని నినాదాలు చేస్తున్నాయి,. వాటితో ఈ అమాయకపు జంతువులు గొంతు కలుపుతున్నాయి.

మరి కోర్టు కేసులో వున్నభూమిలోకి ఈ మహావృక్షాలు పెరిగి పెద్దగవడం తప్పా కాదా..?

తప్పే తప్పే..అవి పెరగడమే కాక తమ పచ్చదనంతో మనలందరినీ ఆకర్షించడం మోసం చేయడమా కాదా.,.?

అవును మోసమే మోసమే...

కోర్టు కేసులో వున్న భూమిలో పెరుగుతూ...ఇట్లా మనలను మాయచేసి మత్పరిచ్చి.... మనలను తమవైపు గుంజుకున్న ఈ 400 ఎకరాల్లోని పచ్చని చెట్లు పొదలు నేరం చేసినట్టా కదా..?

నేరం చేసినై..నేరం చేసినై...

మనలను మాయ చేయడం వారి మొదటినేరమైతే మరో నేరమున్నది..చెప్పాలా..?

చెప్పండి.. చెప్పండి

అమాయకపు జీవాలకు గుంటనక్కలు టెన్షన్ పెడుతూ తమవైపు తిప్పుకుంటున్నయి.

చెప్తా వినండి..

19 ఏండ్ల కింద అక్రమంగా వచ్చి చేరిందే కాకుండా..ఇటీవలే కోర్టు తీర్పువస్తున్నదనీ తెలిసి మనలను అప్రమత్తం చేయకుండా.. కోర్టు తీర్పురాకముందే అప్రమత్తమై మనలను వెల్లిపోమ్మని చెప్పకుండా.. ముందస్తుగా మనకు చెప్పి ఖాళీచేసేలా జాగ్రత్తలు తీసుకోకపోవడం మరో తప్పు...అవునా కాదా...?

అవును అవును...

ప్రభుత్వ బుల్డోజర్లు వచ్చి బలవంతంగా కూల్చేసేదాకా మనకు కనీసం కూడా ఈ పచ్చని చెట్లు సమాచారం ఇవ్వకపోవడం రెండో అతిపెద్ద నేరమా..? కాదా..?

నేరమే నేరమే..

రెండో అతిపెద్దనేరమే...

గట్టిగా అరుస్తునయి తొడేల్లు గుంటనక్కలు వూసరవెల్లులు..

విషయం అర్థం కాని అమాయకపు జింకలు కుందేల్లు నెమల్లు వాటితో పాటే గొంతు కలుపుతున్నయి...అనుమానంగా..

వీల్ల మూడ్ పక్కకుపోయి విషయం అర్థమైతే తాము అనుకున్న పనిచేయడానికి మద్దతు దొరకదనే ఎత్తుగడతో...వెంటనే పెద్ద గుంటనక్క ప్రకటించింది..

మన ప్రాణాలు పోవడానికి అసలు నేరస్తులు 19 ఏండ్ల కింద ఇక్కడికి వీసాలేకుండా ట్రెస్ పాస్ చేసి వచ్చి పెరిగిన ఈ పచ్చిన చెట్లే కావట్టి.. మనం ముందుగానే తీర్మానం చేసుకున్నట్టు...వీటిని ఏం చేయాలి..?

వెంటనే ఏమాత్రం సమయమివ్వకుండా...నరికేయాలి నరికేయాలి ఈ చెట్లను నరికేయాల్సిందే...వాటికి తగిన శిక్ష పడాల్సిందే...నంటూ మల్లా మిగిలిన గుంటనక్కలు తొడేల్లు వూసరవెల్లులు గొంతు కలిపినయి.

విషయం చిన్న చిన్నగా అర్థమవుతున్న మూగజీవాలను బెదిరించి నట్టు మాట్లాడుతూ... తమ ఆస్తాన మీడియా సిద్దం చేసిచ్చిన పెద్దగుంట నక్క వొక వార్తపేపర్ల కట్టను వాటిముందుంచింది. మీకింకా అనుమానం వుంటే చూడండి మా నిజ నిర్ధారణ కమిటి అన్నీ ఎంక్వేరీ చేసిన తర్వాతనే అఈ నిర్ణయం తీసుకున్నాం. ..చూడండి చూడండి అంటూ..పేపర్ల కటింగు కట్టను ముందల విసిరేసింది.

మల్లా అదే గుంటనక్క తమ ఆస్తాన పేపర్ను తీసుకుని సదరు వార్తను మూగజీవాలకు చూయిస్తూ డేట్లైన్ తో సహా చదవడం ప్రారంభించింది.

న్యూఢిల్లీ నుంచి వార్త.. ప్రముఖ కాంగ్రేస్ ఎంపీ గారు పెట్టిన ప్రెస్ మీట్ వార్త...మన నిజనిర్ధారణకు బలమైన సాక్ష్యంగా నిలిచిన వార్త...వినండి అంటూ చదవడం ప్రారంభించింది.

"19 ఏండ్లనుంచి కంచె గచ్చిబౌలి 400 ఎకరాల భూమి వివాదం కోర్టు కేసులో నడుస్తావుంది..అటువంటి కోర్టు కేసులో చిక్కుకున్న వివాదాస్పద భూమిలోకి ఎవరూ ఎంక్రోచ్ కాకూడదు. మరి ఈ చెట్లు చేమలు పొదలు గుండుగుత్తగా ఈ పచ్చదనమంతా కూడగట్టుకుని ఈ 400 ఎకరాల వివాదాస్పద భూమిలోకి ఎట్లా ట్రెస్ పాసయింది.. ఎందుకయ్యిందో చెప్పాలి. అది అర్థం చేసుకోకుండా నేరాన్ని ప్రభుత్వం మీదికి బుల్డోజర్ల మీదికి నూకడం తప్పు..కావట్టి నేరం బుల్డోజర్లది కాదు...అక్రమంగా అవగాహనారాహిత్యంగా పచ్చగా పెరిగిన చెట్లదే..." అనే వార్తను లౌడ్ స్పీకర్లో ప్రకటించింది పెద్ద గుంటనక్క.

వెంటనే ఆగకుండా....మరి నేరం రుజువైనందున..నేరస్తులైన పచ్చని చెట్లను నరికేయాల్సిందిగా తీర్మానం చేయాలిగా...

అంది రెండో గుంటనక్క.

చేయాలి చేయాలి...

ముందస్తు ప్లాన్ ప్రకారం కోరస్ అందుకున్నయి అన్నీ

యే మాత్రం ఆలస్యం కావద్దని....పెద్ద గుంట నక్క తీర్మానం రాసి చదువుతున్నది.

"గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారికి.

నేరం చేసిన వృక్షాలను నిలువునా నరికేయాలని మా అడివి జీవాలు చేసుకున్న తీర్మానం ప్రకారం.. ప్రస్తుతం కూల్చివేస్తున్న బుల్డోజర్లు సరిపోవట్లేవు. వాటితో పాటుగా.. పెద్ద కటింగు మిషన్లు తెచ్చి ఈ పచ్చని చెట్లకు నరికివేత శిక్షను తక్షణమే అమలు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం... తొడేల్లు వూసరవెల్లులు గబ్బిలాలు బోలెగద్దలు తదితర అడవి జంతువుల పెద్దల సమక్షంలో ఇది మా అందరి ఇష్టపూర్తిగా రాసుకున్న తీర్మానం.

**ఇట్లు అడవి పెద్దలు - గుంటనక్కలు**

**(ఇది కథ. ఇందులో పాత్రలు సందర్భాలు అన్నీ కల్పితాలు... ఎవరినీ ఉద్దేశించినవి కావు..గమనించగలరు)**



**- హజారి**

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 06, ఏప్రిల్ 2025 ‖

# శ్రీవారిని దర్శించుకున్న మంత్రి నాదెండ్ల

**తిరుమల, మహానాడు:**
తిరుమల శ్రీవారిని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబ సమేతంగా శనివారం ఉదయం దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయక మండపంలో మంత్రికి వేద పండితులు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి సామాన్య భక్తుల వలె అందరితో కలిసి భోజనం చేశారు.



# బాబు జగజ్జీవన్ రామ్ సేవలు వెలకట్టలేనివి

● మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, మహానాడు:** స్వాతంత్ర సమరయోధుడిగా, సామాజికవేత్తగా, రాజకీయవేత్తగా బాబు జగజ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొనియాడారు. శనివారం బాబు జగజ్జీవన్ రామ్ 117 వ జయంతి సందర్భంగా రామచంద్రాపురం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో, రామచంద్రపురం మండలం నరసాపురపు పేట, తాడిపల్లి గ్రామాలలో ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. బీహార్ రాష్ట్రంలో సాధారణ కుటుంబంలో జన్మించిన బాబు జగజీవన్ రామ్ భారతదేశపు మొట్టమొదటి దళిత ఉప ప్రధానమంత్రిగా పనిచేయడం ఆదర్శనీయమన్నారు. 40 ఏళ్ళపాటు ఆయన పార్లమెంటు సభ్యులుగా పనిచేశారని.. దీని ద్వారా



ప్రజలకు ఆయనపై రాజకీయవేత్తగా ఉన్న నమ్మకం అర్థం అవుతుందన్నారు.

1940– 46 మధ్యకాలంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అనేకసార్లు జైలు పాలయ్యారన్నారు. అంటరానితనం నిర్మూలన మీద అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. 1971 వ సంవత్సరంలో భారత్ పాకిస్తాన్ యుద్ధ సమయంలో రక్షణ శాఖ మంత్రిగా పనిచేస్తూ క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. ఆయన మొట్టమొదటిగా కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని.. ఆయనను ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా కార్మికులకు మేలు చేసేలా తన బాధ్యతలు నిర్వహిస్తారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసాపురపు పేట తాడిపల్లి సర్పంచులు లక్ష్మీ, బాలసుబ్రహ్మణ్యం, ప్రజా ప్రతినిధులు దళిత సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు!

● వివిధ సమస్యలపై గ్రీవెన్స్ కు తరలివచ్చిన అర్జీదారులు
● వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు సుజాత, ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులు

**మంగళగిరి, మహానాడు:** టీడీపీ కేంద్ర కార్యాలయంలో వివిధ సమస్యలపై తరలి వచ్చిన అర్జీదారుల నుండి శనివారం మాజీ మంత్రి పీతల సుజాత, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు వినతులు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి ఆయా సమస్యలను తెలియజేసి వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

- చిత్తూరు జిల్లా యాదమరి మండలం యోర్ధానపల్లి గ్రామానికి చెందిన ఎమ్. వెంకటేశులు గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. చరన్, రాజేష్ లు తమ భూమిని కబ్జా చేసేందకు యత్నిస్తున్నారని.. అలాగే వారి నుండి తమకు ప్రాణహాణి ఉందని.. దయచేసి తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశాడు.
- తన భూమిని కబ్జా చేయడమే కాకుండా.. తమను చంపుతామని కబ్జా చేసిన వ్యక్తులు బెదిరిస్తుంటే స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడంలేదని..పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం జలాల్ పురం గ్రామానికి చందిన పువ్వాడ వెంటేశ్వర రావు గ్రీవెన్స్ అర్జీ ఇచ్చి వాపోయాడు. నాగభైరవ, హరికృష్ణ అనే వ్యక్తుల నుండి తన భూమిని విడిపించాలని కోరారు.
- ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోకవరం గ్రామానికి చెందిన నెక్కంటి కృష్ణారావు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. నల్లా గోపీనాథ్ అనే వ్యక్తి వద్ద తాము భూమి కొనుగోలు చేశామని.. భూమి కోసం ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చాక తమకు భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బంది పెడుతున్నాడని తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశాడు.
- ఏలూరు జిల్లా చాట్రాయి మండలం కృష్ణారావు పాలెం



గ్రామానికి చెందిన పండు తిరుపతి దాసు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ. తన అన్న ఆయనకు వచ్చిన వాట అమ్ముకోని మళ్లీ తన వాటాను అక్రమంగా తన పేరుమీద ఎక్కించుకున్నాడని.. దీనికి అధికారులు సహకారం అందించారని.. దయ చేసి తనకు న్యాయం జరిగేలా చూడాలని తనకు రావాల్సిన వాటాను తనకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశాడు.
- కర్నూలు జిల్లా సి.బెలగల్ మండలం కంబదహాల్ గ్రామానికి చెందిన కురువ మల్లికార్జున విజ్ఞప్తి చేస్తూ.. తాము ముగ్గురం అన్నదమ్ములమని.. పెద్దల నుండి వచ్చిన ఆస్తిని తమకు తెలియకుండా మూడోవవాడు తన తల్లిని రిజిస్ట్రేషన్ ఆఫీసుకు తీసుకెళ్లి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని.. దాన్ని రద్దు చేసి ఆస్తి సమానంగా వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశాడు.



- పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన చల్లా శివకుమార్ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన స్థలాన్ని కబ్జా చేశారని.. రెండు సార్లు కలెక్టరేట్ లో అర్జీ పెట్టుకున్నా.. తనకు ఎటువంటి న్యాయం జరగలేదని.. దయ చేసి తన స్థలాన్ని కబ్జా నుండి విడిపించి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.



# బడుగుల బంధువు జగ్జీవన్ రామ్

● డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

**నరసరావుపేట, మహానాడు:** పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో టీడీపీ దర్శి ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడారు. బడుగుల సాధికారికత, దేశ అభివృద్ధి ధ్యేయంగా జగజ్జీవన్ రామ్ కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పార్టీ జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# బడుగుల హృదయాల్లో జగజ్జీవన్ రామ్ స్థానం సుస్థిరం

● మాజీమంత్రి ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, మహానాడు:** సమసమాజ స్థాపన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన అతికొద్ది మంది మహనీయుల్లో బాబూ జగ్జీవన్ రామ్ ఒకరని, బడుగు, బలహీన వర్గాల హృదయాల్లో ఆయన స్థానం సుస్థిరమని మాజీ మంత్రి, శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.

పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకల్ని కూటమిశ్రేణులు ఘనంగా నిర్వహించాయి. వేడకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్తిపాటి బాబూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ లు పేదల ప్రజల సంక్షేమం, సామాజిక సమానత్వం కోసం తమ జీవితాలనే త్యాగం చేశారని పుల్లారావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గలలోని వివిధ హెూదాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్త కుటుంబాన్ని ఆదుకున్న టీడీపీ!

● మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

**ఆదోని, మహానాడు:** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. ఆదోని మండలం బసాపురం గ్రామానికి చెందిన మాల వీరేష్ అనే టిడిపి కార్యకర్త గత ఫిబ్రవరి నెలలో బైక్ ఆక్సిడెంట్‌లో మృతిచెందారు. అతనికి పార్టీ సభ్యత్వం ఉండడంతో బాధిత కుటుంబానికి టీడీపీ 5 లక్షల రూపాయలు ప్రమాద బీమాను వారి నామిని అకౌంట్ లో జమ చేసిందని నాయుడు తెలిపారు. వారి కుటుంబ సభ్యులు మీనాక్షి నాయుడుని కలిసి పార్టీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడుతూ పార్టీ ఎల్లవేళలా పార్టీ కార్యకర్తల కోసం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రామస్వామి, అప్సర్ బాష, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మధిర వీరేష్, సుధాకర్ లు పాల్గొన్నారు.

# బుచ్చి పట్టణ అభివృద్ధి నా బాధ్యత

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**బుచ్చిరెడ్డి పాళెం, మహానాడు:**
తెలుగుదేశం పార్టీ అధికారంలోనికి వచ్చాక గత కొన్నేళ్లుగా ఆగిపోయిన అభివృద్ధి పనులు పునః ప్రారంభం అవుతున్నాయని కొవ్వూరి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలోని ఖాజానగర్ ప్రాంతంలో ఆమె శనివారం పర్యటించారు. స్థానిక సమస్యలకు సంబంధించి వినతి పత్రాలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 5, 6, 7 వార్డుల పరిధిలో రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సరఫరా తదితర సౌకర్యాలను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ మంచినీటి ఎద్దడి వున్న 02,10,11,12,13 వార్డులలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో ఎంపి లాడ్స్ ద్వారా 12 లక్షల 50 వేలు వెచ్చించి 5 బోర్ వెల్స్ వేసిన విషయాన్ని ప్రస్తావించారు. 5, 6 వ వార్డులలో ప్రజావసరాలను దృష్టిలో వుంచుకొని 7 లక్షలు ఎంపి లాడ్స్ ద్వారా గుడిపల్లి కాలువపై కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. గుడిపల్లి కాలువలో సిల్ట్ క్లియరెన్స్ తో పాటు ఇరు వైపులా కాంక్రీట్ రివిట్మెంట్ సేఫ్టీ వాల్



నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ కమీషనర్ డి బాలకృష్ణ, ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ ఛైర్మన్లు యరటపల్లి శివ కుమార్ రెడ్డి, నస్రీన్ ఖాన్, కౌన్సిలర్లు షేక్ రహమత్ బాష, తాళ్ల వైష్ణవి, అందే ప్రత్యూష, కత్తి నాగరాజు శ్రీదేవిలతో పాటు టిడిపి నాయకులు ఎంవి శేషయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



యడ్లపాడు మండలంలోని బోయపాలెం నుంచి గోపాలపురం, చెంఘిజ్ ఖాన్ పేటకు నూతనంగా వేస్తున్న బీటీరోడ్డును, ఆయాగ్రామాల్లో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, డ్రైనేజ్‌లను మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్ అండ్ బీ అధికారులు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.





గుంటూరు పట్టణంలో మార్కెట్ సెంటర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలదండ వేసి నివాళులు అర్పించిన మాజీ మంత్రి, వేమూరు శాసన సభ్యుడు నక్కా ఆనంద బాబు.

# బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు సీఎం కృషి

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**విజయవాడ, మహానాడు:**
బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలకు అనుగుణంగా వెనుకబడిన వర్గాలు ఉన్నత స్థానంలోకి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ4 అనే విప్లవాత్మకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. శిఖామణి సెంటర్ లో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బాబూ జగ్జీవన్ రామ్ జయంతి లో ఎంపి కే పాల్గొన్నారు. శిఖామణి సెంటర్ లోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు ఎంపి కేశినేని శివనాథ్ స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కులరహిత సమాజం కోసం పోరాడి నవయుగ వైతాళికుడు బాబూ జగ్జీవన్ రామ్ అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి కొండపల్లి లక్ష్మణరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి దోమకొండ రవికుమార్, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, ఎపీ బిల్డింగ్ అదర్స్ కనస్ట్రక్షన్ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, 2వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు దాసరి గాబ్రియేల్, 3వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు బాబురావు, 6వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు పడాల గంగాధర్, టిడిపి నాయకులు మాదిగాని గురునాథం, చాట్ల రాజశేఖర్, వి.జాన్ భాస్కర్, నరసింహాచౌదరి, అబీద్ హుస్సేన్, వేదవ్యాస్,పట్నాల హరిబాబు లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# దేశ సేవకుడు బాబూ జగజ్జీవన్ రామ్

● ఎమ్మెల్యే సత్యానందరావు

**కొత్తపేట, మహానాడు:** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రాం జయంతి సందర్భంగా కొత్తపేటలోని జగజ్జీవన్ రాం విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగజ్జీవన్ రాం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి భాస్కరరావు, విల్లా మారుతీ, రాజకుమార్ వాడయార్, ధరణాల రామకృష్ణ, బీర ఇస్సాక్, దేవపాటి వెంకటేశ్వరరావు, నల్ల రమణ, పల్లికొండ సుధీర్, ముద్రగడ సుబ్బారావు, బండి రాజు, కముజు శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 06, ఏప్రిల్ 2025

### అరెస్ట్ చేయడానికి దమ్ము అవసరం లేదు..

## వారెంట్ ఉంటే చాలు రోజమ్మా!

- రోజా నోటి దూల వల్లే వైసీపీకి 11సీట్లు
- శాప్ చైర్మన్ రవి నాయుడు



**తిరుపతి:** రోజాను అరెస్ట్ చేయడానికి దమ్ము అవసరం లేదు. వారెంట్ ఉంటే చాలు రోజమ్మా. పేదప్రజలు, క్రీడాకారుల డబ్బులను అప్పనంగా నొక్కేసిన వ్యక్తి రోజా. రోజా అవినీతిపై పూర్తి స్థాయి విచారణ జరుగుతోంది. రోజా శ్రీక్రిష్ణ జన్మస్థానానికి వెళ్ళడం గ్యారంటీ. నిరుపేదల క్రీడాకారులకు చెందిన 119కోట్లను రోజా దోచేశారు. క్రీడాకారుల డబ్బులతో బంగారు నగలు, నెక్లెస్ లను రోజా కొన్నారు.


రోజా నోటి దూల వల్లే వైసీపీకి 11సీట్లు వచ్చింది. చంద్రబాబును ఏకవచనంతో మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదు. చెన్నైలో తిరిగే రోజాకు ఏపిలో జరిగే అభివృద్ధి, సంక్షేమం గురించి ఏం తెలుస్తుంది? జగన్ వీకెండ్ పొలిటీషియన్. కర్ణాటకలో బిజినెస్ నడుపుతున్న జగన్ అక్కడే ఉండిపోవాలి. తిరుపతిలో వైసిపి నేతలు పగటివేషగాళ్ళలాగా తయారయ్యారు.

విద్యుత్ ఛార్జీలను పెంచలేదన్న విషయం భూమన అభినయరెడ్డికి తెలియకపోవడం విడ్డూరం. విద్యుత్ ఛార్జీలపై బహిరంగ చర్చకు అభినయరెడ్డి సిద్ధమా? భూమన అభినయరెడ్డికి కనీస పరిజ్ఞానం కూడా లేదు.

భూమన కుటుంబం భూబాగోతం ప్రజలందరికీ తెలుసు. టిడిఆర్ బాండ్ల కుంభకోణంలో అసలు పాత్రధారి భూమన అభినయరెడ్డి. టిటిడి నిధులతో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను అభివృద్ధి చేస్తే తప్పేంటి.?

## వక్ఫ్ సవరణ చట్టంతో పీడిత వర్గాల ముస్లింలకు న్యాయం

- ఢిల్లీలో రూ.650 కోట్ల వ్యయంతో నిర్మించిన "మాన్సర్" అనే హొటల్‌కు కేవలం నెలకు రూ. 12 వేల అద్దె
- రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్



**హైదరాబాద్:** వక్ఫ్‌బోర్డు పేరుతో పేద ముస్లింల హక్కులను కాలరాస్తూ, వేల కోట్ల రూపాయల విలువైన భూములను కొంతమంది ముస్లిం పెద్దలు దోచుకుంటున్న పరిస్థితుల్లో, నరేంద్ర మోదీ ప్రభుత్వం చరిత్రాత్మకంగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం పీడిత వర్గాల ముస్లింలకు న్యాయం చేస్తుందని రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్ స్పష్టం చేశారు.

వక్ఫ్ బోర్డు పరిధిలో ఉన్న రూ. 1.2 లక్షల కోట్ల విలువైన భూములు అవినీతిపరుల చేతుల్లో అన్యాక్రాంతమవుతున్నాయని, కేంద్రం తీసుకొచ్చిన సవరణల ద్వారా వీటి పూర్తి డాక్యుమెంటేషన్, ఆదాయం-వ్యయం వివరాలు సెంట్రల్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నదని వివరించారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

తెలంగాణలోని 77,538 ఎకరాల వక్ఫ్ భూముల్లో 75% ఆక్రమణకు గురవడం వెనుక కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీలు, ఎంఐఎం అగ్రనాయకుల పాత్ర కూడా ఉందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎం కు మద్దతుగా వక్ఫ్ బిల్లును వ్యతిరేకించ డమే కాకుండా, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థిని నిలబెట్టకుండా ఎంఐఎం ను గెలిపించేందుకు కుమ్మక్కయ్యాయని లక్ష్మణ్ మండిపడ్డారు.

తెలంగాణలో కాంగ్రెస్-బీఆర్ఎస్-ఎంఐఎం కుమ్మక్కు రాజకీయాలు రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మారాయని పేర్కొన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని నిలిపి వేయాలని పార్లమెంట్‌లో తెలంగాణ బిజెపి ఎంపీలుగా తాము గళమెత్తామని లక్ష్మణ్ గుర్తుచేశారు.

విద్యార్థులపై లాఠీచార్జ్ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశత్వానికి నిదర్శనంగా మారిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం మతం, కులం, ప్రాంతాలకు అతీతంగా పాలన అందిస్తోందని తెలిపారు. రానున్న హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గౌతమ్ రావుకు ఓటేయాలని ప్రజలను కోరారు.


వక్ఫ్ బోర్డు ముసుగులో లక్షల కోట్ల రూపాయల ఆస్తులపై కొందరు ముస్లిం పెద్దలు సాగిస్తున్న అక్రమాలను కట్టడి చేసేందుకు -ఆస్తుల డాక్యుమెంటేషన్, రిజిస్ట్రేషన్, ఆదాయ-వ్యయాల వివరాలు అన్నీ పారదర్శకంగా దేశ ప్రజలకు కనిపించేలా సెంట్రల్ పోర్టల్‌లో నమోదు చేసే విధంగా వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకురావడం జరిగింది.

ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచార్ కమిటీ.. వక్ఫ్ బోర్డు వార్షిక ఆదాయాన్ని కేవలం రూ. 160 కోట్లుగా మాత్రమే చూపిస్తున్నారని నివేదికను బహిర్గతం చేయడం జరిగింది. కాని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం బడా ముస్లిం నేతలను కాపాడే ప్రయత్నం చేసింది. వక్ఫ్ సవరణ చట్టంతో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్య సదుపాయాలు అందేందుకు మార్గం సుగమమైంది.

ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 77,538 ఎకరాల వక్ఫ్ భూమిలో 75% అంటే 57,000 ఎకరాలకుపైగా ఆక్రమణకు గురయ్యాయి. ఢిల్లీలో రూ. 650 కోట్ల వ్యయంతో నిర్మించిన "మాన్సర్" అనే హొటల్‌ను కేవలం నెలకు రూ. 12 వేల అద్దెకు ఇవ్వడం వలనువక్ఫ్ ఆస్తులు ఎలా నిర్వాహకుల చేతుల్లో నష్టపోతున్నాయో స్పష్టమవుతోంది. ఈ ఆదాయం అసలు పేద ముస్లింల సంక్షేమానికి, విద్య, ఆరోగ్య అభివృద్ధికి ఉపయోగపడాల్సినవి.

కానీ వక్ఫ్ బోర్డులో కొంతమంది పెద్దలు దాన్ని తమ స్వప్రయోజనాల కోసం దారి మళ్లిస్తూ, ప్రజల హక్కులను తాకట్టు పెట్టడమే ఈ ఉదాహరణ ద్వారా స్పష్టం అవుతోంది.

మోదీ ప్రభుత్వం మత, కుల, ప్రాంతాలకు అతీతంగా పరిపాలన అందిస్తోంది. అందుకే దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రజలు మద్దతు ఇస్తున్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బిజెపి ని గెలిపిస్తున్నారు.






# నలభై ఐదేళ్ల..వికసిత 'కమలం'!


- రెండు నుంచి దేశంలోని అన్ని రాష్ట్రాలకూ విస్తరణ
- ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా ఆవర్భావం
- సిద్ధాంతబలమే దన్నుగా ఎదిగిన బీజేపీ
- వాజపేయి-అద్వానీ, మోదీ-షా ద్వయం హిట్
- పార్టీ కంటే దేశం ముఖ్యం.. ఇదే బిజెపి నినాదం
- 45వ బీజేపీ ఆవిర్భావ దినోత్సవం
- 17 ఏళ్ల అధికారం .... ప్రధానమంత్రులుగా అటల్ బిహారీ వాజ్ పేయి , మోదీ
- 15 రాష్ట్రాల్లో అధికారపీఠం
- దక్షిణ భారత్ పైనే గురి
- దేశమే దేహంగా సాగుతున్న 'కమల' ప్రస్థానం

ఇంతితంతై వటుడింతయై మరియు దానింతై నభోవీధిపై
నంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రునికంతయై ధ్రువునిపైనంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై

దేశమే దేహంగా సాగుతున్న పార్టీ అది. దాని తొలి అడుగు రెండుతో ఆరంభమయింది. హిందుత్వ నినాదమే కాదు. దేశంలో పేదల కష్టాలు తీర్చేందుకు నిరంతర పోరాటాలు. అరెస్టులు, జైళ్లు, నిందలూ, నిర్బంధాలు. అలా వేసిన ఆ రెండు అడుగులు.. అలా అలా.. ఇంతితయి వటుడింతయి.. అన్నట్లు. దేశాన్ని సుదీర్ఘ కాలం శాసించి, శ్వాసించిన కాంగ్రెస్ పార్టీకి ముచ్చటగా మూడు రాష్ట్రాలే మిగిల్చి.. దిగ్విజయంగా సాగుతున్న నలభై ఐదేళ్ల 'కమల' ప్రస్థానం ఇది.

**(ముక్కంటి కంబాల)**

వ్యక్తి కంటే సంఘం ముఖ్యం. సంఘం కంటే దేశమే ముందు అనే నినాదంతో భారతదేశ రాజకీయాల్లో పుట్టింది భారతీయ జనతా పార్టీ. 1980 ఏప్రియల్ 6న మొదలైన బీజేపీ ఎన్నో ఆటుపోట్లు, ఒడుదుడుకులు ఎదుర్కొంది. ఎందరో మహానుభావుల మదిలో నుండి పుట్టిన



సిద్ధాంతాలు. లక్ష్య సాధనకు ఎన్నో ఉద్యమాలు ...అధికారం ఉన్నా లేకున్నా ప్రజల మన్ననలే శ్రీ రామ రక్ష. రెండు పార్లమెంటు సీట్లతో మొదలైన ప్రస్థానం. ఆరుసార్లు దేశాన్ని పాలించారు. 15 రాష్ట్రాల్లో అధికార పీఠమెక్కి వికసిస్తోంది కమలం. భారతీయ జనతా పార్టీ 45 ఏళ్ల నాంది ప్రస్తావన, సాధించిన ఘనత పై ప్రత్యేక కథనం .


భారత దేశాన్ని ఏలుతున్న భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించి నాలుగున్నర దశాబ్దాలైంది. నలుగురైదుగురితో మొదలైన పార్టీ.. నేడు కోట్లాది మంది సభ్యులను సొంతం చేసుకుని దేశంలో అధికారాన్ని దక్కించుకోగలిగింది. అధికారమనేది సులభంగా రాలేదు. ఎంతోమంది నాయకుల త్యాగాలు వారి ఆలోచనలు , సిద్ధాంతాలు , భావజాలాలు, పరిత్వమైన నాయకత్వం , క్రమశిక్షణ , సామాజిక చైతన్యం, జాతీయ భావం వలనే ప్రజల విశ్వాసం పొందేందుకు దోహదపడ్డాయి.

బిజెపి పార్టీ ఆవిర్భావాన్ని పరిశీలిస్తే నేటి భారతీయ జనతా పార్టీలో నాటి జనసంఘ్ మూలాలనుండి ఉద్భవించింది. 1951 అక్టోబర్ 21 న డిల్లీలోని రఘోమల్ బాలికల హైస్కూల్‌లో డాక్టర్ శ్యామా ప్రసాద్ జనసంఘ్‌ను ఏర్పాటు చేసారు... స్వాతంత్ర ఉద్యమ చరిత్ర కలిగి దేశంలో ఏకచక్రాధిపత్యంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జనసంఘ్ అడుగులు పడ్డాయి. 1952 లోజరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మూడు సీట్లు సాధించిన జనసంఘ్ క్రమేనా బలాన్ని పెంచుకుంటూ బలపడింది.

1975,77 ఎమర్జన్సీ పాలన తర్వాత జనతా పార్టీలో జన సంఘ్ విలీనం అయింది. జనతాపార్టీ కార్యనిర్వాహక మండలి సభ్యులు పార్టీ మరియు ఆర్ ఎస్ ఎస్ ద్వంద సభ్యులుగా ఉండకూడదని నిషేదించింది. దీంతో జనసంఘ్ వర్గం జనతా పార్టీను వీడి 1980 ఏప్రియల్ 6 న కొత్త రాజకీయపార్టీగా ఏర్పడింది..అదే భారతీయ జనతా పార్టీ ..అటల్ బిహారీ వాజపేయ్ వ్యవస్థాపక అధ్యక్షులుగా కొనసాగారు.

భారతీయ జనతా పార్టీ లో కొందరి పేర్లు చిరస్మరనీయం. అటల్ బిహారీ వాజ్ పేయి , ఎల్ కె అద్వానీ, పండిట్ దీనదయాళ్ తొలి తరం వారైతే పార్టీ అధ్యక్షులుగా చేసిన అనేక మంది తో పాటు నేటి ప్రధాని నరేంద్రమోది వరకు బీజేపీ బలోపేతంలో బలమైన పాత్ర పోషించారు. బిజెపిలో వాజ్ పేయ్ శకం, మోది శకం అనవచ్చు

1980 లో మొదలైన భారతీయజనతా పార్టీ ప్రస్తానాన్ని పరిశీలిస్తే రెండు దశాబ్దాల రాజకీయాలు మరవలేనివి... గోద్రా, బాబ్రీ లాంటి ఘటనలు బిజెపిని ఇబ్బందులు కు గురిచేశాయి. అయినా క్రమిశిక్షణ సిద్ధాంతాలు కలిగిన వాజ్ పేయ్ , అద్వానీ లాంటి నేతలు బలమైన నాయకత్వాన్ని ఇచ్చాయి. 1984లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 2 స్థానాలు దక్కించుకుని బిజెపి తన వాణిని పార్లమెంట్ లో వినిపించేందుకు అడుగుపెట్టింది... అధ్వానీ అధ్యక్షుడిగా ఉన్న



సమయంలో 1989 లో జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా 85 స్థానాలను బిజెపి కి వచ్చాయి.

మురళీ మనోహర్ జోషి అధ్యక్షతన 1991 లోజరిగిన ఎన్నికల్లో మరింత పెరిగి 120 సీట్లు సాధించగలిగారు. 1995 తర్వాత ఉత్తర భారతదేశంతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, బీహార్ ఒరిస్సా, గోవా, గుజరాత్ , మహారాష్ట్రలలో బిజెపి తన ప్రస్థానాలను ప్రారంభించి రాజకీయం మొదలు పెట్టింది. దీంతో 1996 లో జరిగిన దేశ ఎన్నికల్లో 161 సీట్లు సాధించి అతి పెద్ద పార్టీగా అవతరించింది. అప్పుడే అటల్ బిహారీ వాజ్ పేయ్ 16 రోజుల పాటు తొలి సారి ప్రధానమంత్రిగా వ్యవహరించారు.

మెజార్టీ లేకపోవడంతో నేషనల్ ,యునైటెడ్ ఫ్రంట్ కూటమి మెజార్టీ ఉండటంతో నాడు చంద్రశేఖర్ , ఐ కె గుజ్రాల్ , దేవెగౌడలు ప్రధానులుగా వ్యవహరించారు..1998 మధ్యంతర ఎన్నికల్లోనూ టిడిపి, ఏఐడిఎంకె మద్దతుతో 182 స్థానాలు సాధించి వాజ్ పేయ్ రెండవసారి ప్రధాని అయ్యారు. ఏఐడిఎంకె మద్దతు ఉపసంహారించడంతో 1999 లో జరిగిన ఎన్నికల్లో బిజెపి వరుసగా విజయం సాధించి, 183 స్థానాలు పొందగా ఎన్ డి ఏ కూటమి కి 303 స్థానాలు దక్కాయి. దీంతో అటల్ బిహారీ వాజ్ పేయి పూర్తికాలం ప్రధానిగా వ్యవహరించి 2004 మే 22 వరకు బీజేపీ పాలన ను దేశానికి అందించారు. 2004,2019 లో యూపిఏ కూటమి అధికారం చేజిక్కించుకోవడంతో బిజెపి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించింది.

వాజ్ పేయి భారత ప్రధానిగా దేశం లో 6 సంవత్సరాల 80 రోజుల సుపరిపాలన సాగింది. బిజెపి ప్రభుత్వంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చింది. కొన్ని నిర్ణయాలు ప్రజల్లో వ్యతిరేకత చూరగొనడంతో పదేళ్లు 2004 నుండి 2014 వరకు అధికారం కోల్పోవాల్సి వచ్చింది. మోదీ రంగ ప్రవేశంతో మళ్లీ మార్పు మొదలైంది.

వాజ్ పేయి శకం తర్వాత బీజేపీ బలమైన నూతన నాయకత్వానికి పట్టం కట్టారు.. ఆ క్రమంలోనే గుజరాత్ కు మూడు సార్లు సీఎంగా చేసిన నరేంద్ర మోడీని ప్రధాని అభ్యర్దిగా ప్రకటించి 2014 లో రంగంలోకి దించి సక్సెస్ అయ్యారు... 2014 లో 282 సీట్లు సాధించి 31 శాతం ఓట్లు పొందింది బిజెపి ..కూటమి సభ్యులతో కలసి 336 సీట్లు ఉండటంతో మోడీ ప్రధాని అయ్యారు.

బేటి పడావో..బేఠి బచావో, సబ్ కా సాత్ .సబ్ కా వికాస్ , లాంటి నినాదాలతో అన్ని వర్గాలకు సముచిత న్యాయం కల్పిస్తూ పాలన సాగించారు. ఫస్ట్ టైమ్ మోది పాలన అద్బుతంగా ఉండటంతో రెండవసారి 2019 లోనూ పూర్తి స్థాయి మెజార్టీ ఇచ్చారు భారత ప్రజలు.. 303 స్థానాలను గెలిచి రికార్డు సాధించింది మోది ప్రభుత్వం... రెండవ సారి మోది ప్రధానిగా ఉన్నప్పుడు ఎన్ ఆర్ సి, సిఏఏ, త్రిపుల్ తలాక్ లాంటి బిల్లులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

మహిళా బిల్లుకు ఆమోదం తెలిపారు. ఇక 2024 లో ఎన్ డి ఏ కూటమి కలసి ముచ్చటగా మూడవసారి బరిలోకిదిగా 240 స్థానాలను గెలుచుకుంది బిజెపి. కూటమి మద్దతుతో 3.0 పేరిట మోది మూడవ సారి ప్రధానమంత్రి అయ్యారు. విజన్ 2047 వికసిత్ భారత్ తో పాలన సాగిస్తున్నారు. నరేంద్రమోది వరుస విజయాలతో యాట్రిక్ సాధించి 11 ఏళ్లు కాలాన్ని పూర్తి చేశారు. 2029 వరకు మోది ప్రధాని గా ఉంటే 15 ఏళ్ల ప్రధానిగా రికార్డు సాధించనున్నారు.


భారతీయ జనతా పార్టీ బలోపేతానికి తెలుగు రాష్ట్రాల నాయకులు విశేష కృషి చేశారు. వెంకయ్యానాయుడు, బంగారు లక్ష్మణ్ లు దేశరాజకీయాల్లోనూ రాష్ట్ర రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించారు.. బిజెపి లో ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యనేతగా చెప్పవచ్చు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పార్టీ బలోపేతం లో ఆయన పాత్ర మరువలేనిది. ఎంఎల్ఏ గా, ఎంపిగా కేంద్రమంత్రిగా , బిజెపి జాతీయ అధ్యక్షునిగా సేవలు అందించి అభివృద్ధికి బాటలు వేసారు. ఉపరాష్ట్రపతిగా పనిచేసి ప్రత్యేక గుర్తింపు సాధించారు.

బిజెపి అనగానే ఉత్తర భారతదేశంలో మాత్రమే ఉందనుకునే వారు.. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలోనూ విడిపోయిన తెలంగాణా, నవ్యాంధ్రలోనూ బిజెపి బలహీన పడలేదు .. అవకాశం అందిపుచ్చుకుని బలపడింది. చట్ట సభల్లోనూ అవకాశాలు పొంది పార్టీ ప్రతిష్టను ఇనుమడింపచేసారు...

45 ఏళ్ల భారతీయ జనతా పార్టీకి రధసారధులుగా ఇప్పటి వరకు 11మంది జాతీయ అధ్యక్షులుగా సారధ్యం వహించారు. బిజెపిలో పార్టీ ప్రెసిడెంట్ అంటే సుప్రీం. మూడేళ్ల పదవీకాలం ఉండే పార్టీ అధ్యక్షపదవి కొంతమందికి రెండు సార్లు దక్కగా కొందరికి ఒక్కసారి మాత్రమే చాన్సు దక్కింది. తొలినాటి అధ్యక్షులు వాజ్ పేయ్ అయితే ప్రస్తుత అధ్యక్షులు గా జెపి నడ్డా ఉన్నారు.

భారతీయ జనతా పార్టీలో అనేక అనుబంధ విభాగాలున్నాయి. జాతీయ స్థాయి నుండి డివిజన్ స్థాయి వరకు , విద్యార్ది , యువజన, మహిళా, కిసాన్ మోర్చాలతో పాటు ప్రధాన పార్టీ విభాగం అంతా కూడా ఒక ప్రణాళిక బద్దంగా క్రమపద్దతిలో నియమిస్తుంటారు. ప్రెసిడెంట్ పదవీకాలం మూడేళ్లు ఉంటుంది. 1980లో పార్టీ స్థాపించిన తరువాత, అటల్ బిహారీ వాజ్పేయి దాని మొదటి అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

ఆ తర్వాత భారత ప్రధాని అయ్యాడు. 2018 ఆగస్టులో



మరణించేనాటివరకు అధ్యక్ష పదవిలో కొనసాగిన ఏకైక బిజెపి అధ్యక్షుడు. 1986లో, లాల్ కృష్ణ అద్వానీ పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశాడు.అద్వానీ మూడు సార్లు వేర్వేరు సమయంలో సుధీర్ఘ కాలం అధ్యక్షుడిగా పనిచేసారు....రాజ్ నాథ్ సింగ్, అమిత్ షాలు కూడా రెండు పర్యాయాలు చొప్పున పనిచేశారు. 2020 నుండి జగత్ ప్రకాష్ నడ్డా అధ్యక్షుడిగా నియమితులయ్యారు.. బిజెపి అధ్యక్షులుగా పనిచేసిన వారిలో అటల్ బిహారీ వాజపేయి,లాల్ కృష్ణ అద్వానీ, మురళీ మనోహర్ జోషి, కుషభావ్ థాక్రే , బంగారు లక్ష్మణ్, జానా కృష్ణమూర్తి, వెంకయ్య నాయ్నుడు, రాజ్ నాథ్ సింగ్, నితిన్ గడ్కరి ,అమిత్ షా, జెపి నడ్డా లు బిజెపి దేశ నేషనల్ ప్రెసిడెంట్సు గా పనిచేసారు..

ఆర్ ఎస్ ఎస్ , జన సంఘ్ ఆవిర్భావం నుండి నేటి బిజెపి వరకు ఆంధ్రాలో నాయకత్వం పరిడవిల్లుతోంది. ఆంధ్రప్రదేశ్ , నవ్యాంధ్రప్రదేశ్ లో బిజెపి కొంత మేర బీజాలు చల్లింది... చట్ట సభల్లోనూ కొంతమందికి అవకాశం దక్కడంతో పాటు కూటమి పొత్తుల వలన ప్రభుత్వంలోనూ బాగస్వామ్యులయ్యారు.. మంత్రులుగా, రాజ్యసభ సభ్యులుగా అవకాశం దక్కింది.

బిజెపి కి మూలమైన ఆర్ ఎస్ ఎస్ , జన సంఘ్ పార్టీ కి ఏపి నుండి ఎంతో మంది కీలకంగా పనిచేసారు.. అట్టి వారిలో జూపూడి యఙ్ఞనారాయణ, గోపాలరావు ఠాగూర్, ఎంఎల్ నరసింహారెడ్డి, అవసరాల రామారావు లాంటి వారు ఎందరో నాయకత్వ ప్రాతినిధ్యం వహించారు. అనేక స్థానిక సంస్థల్లోనూ వీరు పోటీ చేసి విజయం సాధించారు. 1980 తర్వాత బిజెపి నుండి కూటమి పొత్తులో బాగంగా బిజెపి ప్రజా ప్రతినిధులుగా పార్లమెంటు సభ్యులు, మంత్రులు, కేంద్రమంత్రులు ,ఎంఎల్ఏలు, ఎంఎల్సిగా ప్రాతినిధ్యం వహించే అవకాశం చాలామందికి దక్కింది.

వెంకయ్య నాయుడు ఉదయగిరి ఎంఎల్ఏగా 1983లో ఎన్నికయ్యారు.. కోట శ్రీనివాస్ , కంభంపాటి హరిబాబు, ఎంఎస్ పార్థసారథి, అయ్యాజీ వేమా, ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు , ఏబీపీ పికె సత్యనారాయణ, నందిపాకు వెంకటస్వామి, గోకరాజు గంగరాజు, విష్ణుకుమార్ రాజు, ఆకుల సత్యనారాయణ, పైడికొండ మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస్ లు చట్టసభల్లో పనిచేసారు.

ఇక ప్రస్తుతం 2024 ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ ఎన్ డిఏ కూటమి లో భాగంగా 8 మంది బిజెపి ఎంఎల్ఏలు అయ్యారు.వారిలో సత్యకుమార్ యాదవ్ మంత్రి అయ్యారు. సుజనా చౌదరి, ఆదినారాయణరెడ్డి, కామినేని శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, పివి పార్థసారధి, ఈశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లు ఏపిలో కొనసాగుతున్నారు. పార్లమెంట్ సభ్యులు గా సీఎం రమేష్ , దగ్గుబాటి పురందరేశ్వరి, భూపతి రాజు శ్రీనివాసశర్మ ఎంపీలుగా కొనసాగుతుండగా.. శ్రీనివాస శర్మ కేంద్రమంత్రిగా కొనసాగుతున్నారు.

ఏపి శాసన మండలిలో సోము వీర్రాజు ఎంఎల్సి గా కొనసాగుతున్నారు .గతంలో మాధవ్ బిజెపి ఎంఎల్సిగా పనిచేసారు. ఇవి కాకుండా నామినేషన్ పదవులు బిజెపి వారికి దక్కుతుండటంతో ఏపిలో పార్టీ బలోపేతానికి మార్గం సుగుమమైంది.

బిజెపి లక్ష్యం దక్షిణ భారత్ మీద పెట్టింది. దేశం లో 29 రాష్ట్రాలు ఉండగా ఇప్పటికే 15 రాష్ట్రాల్లో అధికారం కైవసం చేసుకుంది. గల్లీ నుండి డిల్లీ వరకు కమలం వికసించాలన్న పట్టుదలలో బాగంగా డిల్లీ పీఠమెక్కారు. ఇక సౌత్ లో స్పేస్ సొంతం చేసుకునేందుకు వ్యహాలు పన్నుతోంది.

బిజెపి దేశంలో బిజెపి ప్రత్యక్షంగా పరోక్షంగా 15 రాష్ట్రాలలో అధికారం దక్కించుకుని కేంద్రంలోనూ రాష్ట్రాల్లోనూ పరిపాలన సాగిస్తుంది. మిగిలిన రాష్ట్రాల్లో బిజెపి బలపడేందుకు ఎత్తులు పైఎత్తులు వ్యూహాలు అమలు చేస్తోంది..కూటమి లో ఉంటూనే బలపడేందుకు



మార్గాలు అన్వేషిస్తుంది. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక ల పై పట్టు సాధించాలన్నది బిజెపి లక్ష్యం గా పనిచేస్తుంది.

2014 లో ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత కంభంపాటి హరిబాబు, కన్నా లక్ష్మీనారాయణ, సోము వీర్రాజు లు బిజెపి రాష్ట్ర రథసారధులుగా పనిచేసారు. ప్రస్తుతం ఎన్ టి ఆర్ కుమార్తె మాజీ కేంద్రమంత్రి , రాజమండ్రి బిజెపి ఎంపి దగ్గుపాటి పురందరేశ్వరి లు బిజెపి ఏపి అధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

బిజెపి ఒక వైపున బలపడుతుంటే మరో వైపున విభిన్న గ్రూపులు పార్టీ అభివృద్ధికి ఆటంకంగా మారుతోంది. గ్రూపులకు అతీతంగా ఏకతాటి పైకి తీసుకురాగలిగితే బిజెపికి ఏపిలో మంచి భవిష్యత్ ఉండనుంది. దేశమంతా బిజెపి దూసుకెళ్తోంది. ఏపీలో కూడా కొంతమేరకు పరుగులుపెడుతున్నా కొన్ని ఆటంకాలు తప్పడం లేదు. గ్రూపు రాజకీయాలు ఎక్కువయ్యాయి...విత్తు ముందా ..చెట్టు ముందా అన్నట్లు పార్టీ ఆవిర్భావం నుండి దశాబ్దాలుగా పనిచేస్తున్న వారు కొందరరైతే.... అవకాశాల కోసం వేర్వేరు పార్టీల నుండి వచ్చిన వారు మరికొందరు.... ఉనికి కోసం స్వలాభం కోసం వచ్చిన వారు మరికొందరు..ఎలయన్సులో బాగంగా ముందస్తుగా సేఫ్ జోన్ బిజెపి పంచన చేరిన వారు ఇంకొందరు బిజెపిలో వివిధ విభాగాల్లో నాయకులుగా సభ్యులుగా కొనసాగుతున్నారు.

ఇవి కాకుండా సామాజిక వర్గాల వారీగా , పార్టీ అధ్యక్షుల స్వంత వారిగా ఉండేవారు లేకపోలేదు. అంటే బిజెపి లో బీజేపీ వారే కాకుండా టిడిపి, కాంగ్రెస్ , జనసేన, ఇతర పార్టీ లనుండి వచ్చినవారు ఉన్నారు. వీరందరిని సిద్దాంతులు పార్టీ లక్ష్యాలు, నియమనిబంధనలు ఆశయాలకు కట్టుబడి ఏకతాటి పైకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అప్పుడే ఏపిలో బిజెపి బలంగా ఎదగగలదు.

చూసారు కదా జన సంఘ్ నుండి మొదలై బిజెపి గా ఆవిర్భవించి 45 ఏళ్ల సుదీర్ఘకాలంలో ఎన్నో విజయాలు సాధించి, దేశమంతా విస్తరించి కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు వికసింపచేసింది కమలం. మున్ముందు దేశప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేర్చాలని కోరుకుంటూ బిజెపి 45 వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు.

**(రచయిత సీనియర్ పాత్రికేయులు)**

09

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 06, ఏప్రిల్ 2025 ||

## పిఠాపురంలో రూ. 40 లక్షలకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

### శాసన మండలి సభ్యులు నాగబాబు చేతుల మీదుగా అందజేత



**పిఠాపురం:** నియోజకవర్గం పరిధిలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత సహకరించని స్థితిలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం కోసం దరఖాస్తు చేసుకున్న పలువురికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ చొరవతో నిధులు మంజూరయ్యాయి. మొత్తం 45 మందికి రూ. 40 లక్షల పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు కాగా.. పిఠాపురం పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం చేబ్రోలులోని పవన్ కళ్యాణ్ నివాసంలో జరిగిన ఓ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు కొణిదెల నాగబాబు లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. సాయం కోసం దరఖాస్తులు వచ్చిన వెంటనే పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరితగతిన సాయం అందే ఏర్పాటు చేసినట్టు ఈ సందర్భంగా తెలిపారు.







## హాస్టల్ విద్యార్థినులతో ముచ్చటించిన సీఎం చంద్రబాబు

**ముప్పాళ్ల, మహానాడు:** ఎన్టీఆర్ జిల్లా, నందిగామ నియోజకవర్గం, ముప్పాళ్లలోని బాలికల గురుకుల సంక్షేమ వసతి గృహాన్ని, పాఠశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొనడానికి ముప్పాళ్ల వెళ్లిన సీఎం చంద్రబాబు గురుకుల పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పాఠశాల అంతా కలియదిరిగారు. వంటశాల, భోజన శాలలో పరిశుభ్రతను పరిశీలించారు. కోడిగుడ్లు, బియ్యం, కూరగాయలు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచిగా, నాణ్యతతో అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి సీఎం తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా అని అడిగారు. అనంతరం డార్మెటరీని పరిశీలించారు.







## ఆదర్శనేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్

### - మంత్రి నారా లోకేష్

**అమరావతి, మహానాడు:** భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళి అర్పిస్తున్నాను. దేశ స్వాతంత్ర్యం కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శనేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్. దేశానికి ఆయన చేసిన సేవలు నిరుపమానం. దళితుల అభ్యున్నతికి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఎనలేని కృషిచేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరం కృషిచేద్దామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎస్సీ సెల్ నేతలు, ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.




కేసీఆర్‌పై ఆర్టిస్ట్, గాయకుడు ఈశ్వర్ రూపొందించిన పాటను బి.ఆర్.ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు . శనివారం ఎర్రవెల్లిలోని నివాసంలో 'తెలంగాణ జాతిపిత కేసీఆర్ పాట' పేరుతో ఉన్న సీడీ నమూనాను బి.ఆర్.ఎస్ అధినేత ఆవిష్కరించారు.



## అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన

**నందిగామ, మహానాడు:** బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా చందర్ల పాడు మండలం, ముప్పాళ్లలో శనివారం నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఎన్‌టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యుడు తంగిరాల సౌమ్య తదితరులతో కలిసి వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనకు సంబంధించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. రూ.5.75 కోట్లతో వెల్లటూరు గ్రామంలో ఫుట్‌వేర్ తయారీ యూనిట్ నిర్మాణం పనులకు, రాష్ట్ర వ్యాప్తంగాకమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల (గురుకులం, ఎస్సీ హాస్టళ్లు) పనులకు, 3. 221 ఆదర్శ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌వో ప్లాంట్ల ద్వారా తాగునీటి సరఫరా పథకం పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.

## రేవంత్ క్యాబినెట్‌లో పనిమంతులు ఇద్దరేనట!

- శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాత్రమే పనిమంతులు
- ఉత్తమ ఎమ్మెల్యే హరీష్‌రావు
- రెండు, మూడు స్థానాల్లో కేసీఆర్, శ్రీధర్‌బాబు
- కేటీఆర్‌కు 7వ స్థానమే
- ఎస్సీ ఎమ్మెల్యేలలో భట్టికి అగ్రస్థానం
- ఎస్టీ ఎమ్మెల్యేలలో సీతక్కకు పెద్దపీట
- మహిళా ఎమ్మెల్యేలలో మొదటి స్థానంలో సబితా ఇంద్రారెడ్డి
- పీపుల్స్‌పల్స్, సౌత్ ఫస్ట్ సర్వే ఫలితాలు

**హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో పని మంతులు ఇద్దరేనట. వారెవరంటే శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాత్రమేనట. ఇక ఉత్తమ ఎమ్మెల్యే ఎవరంటే మాజీ మంత్రి హరీష్‌రావు మాత్రమేనట. ఈ విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ది 7వ స్థానమట. ఇక ఎస్సీ ఎమ్మెల్యేలలో ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క, ఎస్టీ ఎమ్మెల్యేలలో మంత్రి సీతక్కదే అగ్రస్థానం. పీపుల్‌పల్స్, సౌత్‌ఫస్ట్ వెబ్‌సైట్ నిర్వహించిన సర్వేలో తేలిన ఫలితాలివి.

తెలంగాణలోని 118 మంది ఎమ్మెల్యేలలో బాగా పనిచేస్తున్న 10 మంది జాబితాలో రేవంత్ రెడ్డి మంత్రివర్గంలోని వారిద్దరూ మాత్రమే ఉన్నారు. మొత్తం ఎమ్మెల్యేలో మూడింట రెండు వంతుల మంది బాగా పనిచేయని' లేదా ఓ మాదిరిగా పనిచేస్తున్న' వారి జాబితాలో ఉన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి దాదాపు ఒకేవిధంగా ఉంది.

తెలంగాణలో 15 నెలల ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉందని పీపుల్స్ పల్స్-సౌత్ ఫస్ట్ వెబ్సైట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో ఈ ఫలితాలు వెలువడ్డాయి. మార్చి 28 నుండి ఏప్రిల్ 3 వరకు 118 అసెంబ్లీ నియోజకవర్గాలలో (ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ మినహా) సౌత్ ఫస్ట్ వెబ్ పోర్టల్ కోసం పరిశోధనా సంస్థ పీపుల్స్ పల్స్ ఈ సర్వే నిర్వహించింది.

118 మంది ఎమ్మెల్యేలలో, 24 మంది మాత్రమే "బాగా పనిచేస్తున్న వారు"గా గుర్తింపు పొందారు. వారిలో మంత్రులలో డి శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి మాత్రమే -టాప్ 10'లో ఉన్నారు. ఈ సర్వేలో 36 మంది ఎమ్మెల్యేల పనితీరు "చెడు"గా, 58 మంది ఎమ్మెల్యేలను "సగటు"గా రేట్ చేశారు.


రాష్ట్రంలో ప్రస్తుతం అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఏడుగురు పనితీరు బాగుందని, 20 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని, 37 మంది ఎమ్మెల్యేల పనితీరు పర్వాలేదని సర్వేలో వెల్లడైంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలలో 12 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగుందని, 13 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని, 13 మంది ఎమ్మెల్యే పనితీరు పర్వాలేదని సర్వే వెల్లడించింది.





బీజేపీకి సంబంధించి ముగ్గురు ఎమ్మెల్యేల పనితీరు బాగుందని, ఒక ఎమ్మెల్యే పనితీరు బాగోలేదని, నలుగురు ఎమ్మెల్యేల పనితీరు పర్వాలేదని, ఎంఐఎం ఎమ్మెల్యేలలో ఇద్దరు ఎమ్మెల్యేల పనితీరు బాగుందని, ఇద్దరు ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని, ముగ్గురు ఎమ్మెల్యేల పనితీరు పర్వాలేదని వెల్లడైంది. సీపీఐకి చెందిన ఒకే ఒక ఎమ్మెల్యే పనితీరు పర్వాలేదని సర్వేలో తేలింది.

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు టి. హరీష్ రావు అందరికంటే ఉత్తమ ఎమ్మెల్యేగా నిలిచారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ 2వ స్థానంలో, మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్ బాబు 3వ స్థానంలో, ఏఐఎంఐఎం ఫ్లోర్ లీడర్, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ 4వ స్థానంలో, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి 5వ స్థానంలో ఉన్నారు. జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి 6వ స్థానంలో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కెటి రామారావు 7వ స్థానంలో, బీజేపీకి చెందిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ 8వ స్థానంలో, హుజూర్ నగర్ ఎమ్మెల్యే, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 9వ స్థానంలో, బీజేపీకి చెందిన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి 10వ స్థానంలో ఉన్నారు.









మహిళా ఎమ్మెల్యేలలో, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే బీఆర్ఎస్‌కు చెందిన సబితా ఇంద్రారెడ్డి మొదటి స్థానంలో ఉండగా, మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ 7వ స్థానంలో ఉన్నారు.

బీసీ సామాజికవర్గానికి సంబంధించి టాప్ 10 ఎమ్మెల్యేలలో అధికార పార్టీకి చెందిన వారు నలుగురు, ప్రధాన ప్రతిపక్షం టీఆర్ఎస్ కు చెందిన వారు ముగ్గురు, బీజేపీకి చెందిన వారు ముగ్గురు ఉన్నారు. బీసీలకు చెందిన టాప్ 10 ఎమ్మెల్యేలలో బీజేపీకి చెందిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మొదటి స్థానంలో ఉన్నారు.

బీసీ సామాజికవర్గానికి సంబంధించి అధికార కాంగ్రెస్ పార్టీ తరపున బీసీ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ 3వ స్థానంలో ఉండగా, ప్రభుత్వ చీఫ్ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య 6వ స్థానంలో, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ 8వ స్థానంలో, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి 9వ స్థానంలో ఉన్నారు.

బీసీ సామాజికవర్గంలో బీఆర్ఎస్ చెందిన మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ 4వ స్థానంలో, మాజీ మంత్రి సనత్నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ 5వ స్థానంలో, మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి పద్మారావ్ 7వ స్థానంలో ఉన్నారు. బీసీ ఎమ్మెల్యేలకు సంబంధించి టాప్ 10లో బీజేపీకి సంబంధించి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ 2వ స్థానంలో, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పవర్ 10వ స్థానంలో ఉన్నారు.

ఎస్సీ సామాజిక వర్గానికి సంబంధించి ఉప ముఖ్యమంత్రి, మధిర ఎమ్మెల్యే మల్లు బట్టి విక్రమార్క మొదటి స్థానంలో ఉన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం 2వ స్థానంలో, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ 3వ స్థానంలో, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణ 4వ స్థానంలో, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం 5వ స్థానంలో ఉన్నారు.

రాష్ట్ర మంత్రి, ఆందోల్ ఎమ్మెల్యే దామోదర్ రాజనర్సింహ 6వ స్థానంలో, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజ్ 7వ స్థానంలో, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద 8వ స్థానంలో, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి 9వ స్థానంలో, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావు 10వ స్థానంలో ఉన్నారు.

ఎస్టీ సామాజిక వర్గానికి సంబంధించి మంత్రి, ములుగు ఎమ్మెల్యే సీతక్క మొదటి స్థానంలో, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య 2వ స్థానంలో, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు 3వ స్థానంలో, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ 4వ స్థానంలో, వైరా ఎమ్మెల్యే రాందస్ మాలోత్ 5వ స్థానంలో, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు 6వ స్థానంలో, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ నేనావత్ 7వ స్థానంలో, ఆసీఫాబాద్ ఎమ్మెల్యే కోవాలక్ష్మి 8వ స్థానంలో, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ 9వ స్థానంలో, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు 10వ స్థానంలో ఉన్నారు.

## ఉన్నతంగా ఎదిగేందుకు ప్రభుత్వ భరోసా

### - విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**నందిగామ:** బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా చందర్లపాడు మండలం, ముప్పాళ్లలో శనివారం నిర్వహిం చిన ప్రజా వేదిక కార్యక్రమం సందర్భంగా



సాంఘిక సంక్షేమ శాఖ, ఎస్‌సీ కార్పొరేషన్, విభిన్న ప్రతిభావంతుల శాఖ తదితర శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందర్శించారు.

ఎస్‌సీ కార్పొరేషన్ సబ్సిడీతో కూడిన సెర్ప్-ఉన్నతి వడ్డీలేని రుణాల మంజూరుకు సంబంధించిన స్టాల్‌ను సందర్శించి.. మహిళలతో మాట్లాడారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. విభిన్న ప్రతిభా వంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా వివిధ కేటగిరీలకు చెందిన పదిమంది లబ్ధిదారులకు రూ. 3,40,200 విలువైన ఉపకరణాలు అందించారు.

ఒక్కో ట్రై సైకిల్ రూ.60 వేలు కాగా.. రూ. 1,80,000 విలువైన మూడు బ్యాటరీ ట్రైసైకిళ్లను లబ్ధిదారులకు అందజేశారు. డిగ్రీ కోర్సులు చేస్తున్న నలుగురు విభిన్న ప్రతిభావంతులకు ఒక్కొక్కటి రూ.35 వేలు విలువైన ల్యాప్ ట్యాప్‌లను అందజేశారు. ఒక్కొక్కటి రూ. 8,500 విలువైన రెండు వీల్‌ఛైర్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా రూ. 3,200 విలువైన వినికిడి యంత్రాన్ని లబ్ధిదారునికి అందించారు.

## బాల రాముడే బంగారు రాముడే చిన్ని రాముడే మా చిట్టి రాముడే..

వేదాలెన్నో చదివేసాడే
విలు విద్యల్లోనా విరాధి వీరుడే...

బాల రాముడే బంగారు రాముడే
చిన్ని రాముడే మా చిట్టి రాముడే...

బయభక్తులతో పెరిగాడండి
భక్తి శ్రద్ధలతోనే ఉంటాడండి...


బాల రాముడే బంగారు రాముడే
చిన్ని రాముడే మా చిట్టి రాముడే....

తండ్రి మాటనే పాటిస్తాడే
తన అడుగుజాడల్లో నడిచేస్తాడే...

బాలరాముడే బంగారు రాముడే
చిన్ని రాముడే మా చిట్టి రాముడే

చిన్నారి సీతకి చూపులకి వచ్చి
బంగారు సీతని గేలేచాడమ్మా...

బాల రాముడే బంగారు రాముడే



చిన్ని రాముడే మా చిట్టీ రాముడే

ముత్యాల హారమే దారం చేసి
రత్నాల పుస్తెలే కట్టేనమ్మ

బాల రాముడే బంగారు రాముడే
చిన్న రాముడే మా చిట్టీ రాముడే

శ్రీ రామ నవమి శుభాకాంక్షలు

- బోడేపూడి నాగమణి

10

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 06, ఏప్రిల్ 2025 ‖



## 'పెద్ది' ఫస్ట్ షాట్ వర్క్ కంప్లీట్, ముహూర్తం ఫిక్స్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో సంచలనాత్మక దర్శకుడు బుచ్చి బాబు సానా తెరకెక్కిస్తున్నచిత్రం 'పెద్ది'. శ్రీరామ నవమి సందర్భంగా పెద్ది ఫస్ట్ షాట్‌ను రిలీజ్ చేయబోతూన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ ఫస్ట్ షాట్‌కు సంబంధించిన పనుల్ని పూర్తి చేశారు. ఇక ఏప్రిల్ 6న ఈ ఫస్ట్ షాట్‌ను రిలీజ్ చేసేందుకు ముహూర్తం ఫిక్స్ చేశారు. ఈ ఫస్ట్ షాట్ ఏప్రిల్ 6న ఉదయం 11:45 గంటలకు విడుదల కానుంది. ఫస్ట్ షాట్ విడుదలకు కేవలం రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండగా బుచ్చి బాబు సానా, సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహమాన్ తుది మిక్సింగ్ పనిని పూర్తి చేశారు. ఈ ఆదివారం ఫస్ట్ షాట్ గ్రాండ్‌గా విడుదల కానుంది. అభిమానులు ఇప్పుడు ఏప్రిల్ 6న ఈ గ్లింప్స్‌ను చూడటానికి సిద్ధంగా ఉన్నారు. ఈ ఫస్ట్ షాట్ తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషలలో విడుదల కానుంది. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పెద్ది చిత్రం టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో అభిమానుల అంచనాల్ని పెంచేలా పెద్ది ఫస్ట్ షాట్ పవర్-ప్యాక్డ్ విజువల్ ట్రీట్ ఇస్తుందని చిత్రయూనిట్ హామీ ఇస్తోంది.




## 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' లవ్లీ మెలోడీ

టీవీ యాంకర్ టర్నడ్ హీరో ప్రదీప్ మాచిరాజు మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' వేసవిలో ఏప్రిల్ 11న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది. ఈ యూనిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను యంగ్ ట్యాలంటెండ్ డైరెక్టర్స్ డుయో నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. మాంక్స్ & మంకీస్ బ్యానర్ నిర్మిస్తున్న ఈ ఎగ్జైటింగ్ ఎంటర్‌టైనర్‌లో దీపికా పిల్లి కథానాయికగా నటిస్తోంది. టీజర్, ట్రైలర్, సాంగ్స్ విడుదలయ్యాయి. మేకర్స్ ప్రియమార సాంగ్ రిలీజ్ చేశారు. రధన్ సాంగ్ మెలోడీ కంపోజ్ చేశారు. రాకేందు మౌళి సాహిత్యాన్ని అందించారు. శరత్ సంతోష్, లిప్సిక భాష్యం వోకల్స్ మెలోడీగా పనిచేశారు. ప్రదీప్ దీపికల కెమిస్ట్రీ, ఆన్-స్క్రీన్ పై చూశాక ప్రేక్షకులను మెప్పిస్తుందో లేదో చెప్పాలి. ప్రదీప్ తొలి చిత్రం లాగానే, అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి విడుదలకు ముందే మ్యూజికల్ గా హిట్ అవుతుందో లేదో చూడాలి. ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, సత్య, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎంఎన్ బాలరెడ్డి కెమెరా మ్యాన్ గా పని చేస్తున్నారు, కోదాటి పవనకల్యాణ్ ఎడిటర్. సందీప్ బొల్లా కథ, డైలాగ్స్ అందించగా, ఆశిస్తేజ పులాల ప్రొడక్షన్ డిజైనర్.


## 'అరి' నుంచి 'భగ భగ..' లిరికల్

ఆర్ వీ రెడ్డి సమర్పణలో ఆర్వీ సినిమాస్ పతాకంపై శ్రీనివాస్ రామిరెడ్డి, డా.తిమ్మప్ప నాయుడు పురిమెట్ల Ph.D నిర్మిస్తున్న సినిమా 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "పేపర్ బాయ్" చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన జయశంకర్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. స్టార్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ 'అరి' సినిమా నుంచి 'భగ భగ..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. 'భగ భగ..' లిరికల్ సాంగ్ చాలా బాగుందన్న నాగ్ అశ్విన్...మూవీ టీమ్ కు తన బెస్ట్ విషెస్ అందించారు. ఈ పాటను అనూప్ రూబెన్స్ బీట్ కంపోజ్ చేయగా..వనమాలి లిరిక్స్ రాశారు. షణ్ముక ప్రియ, రోహిత్ పీవీఎన్ఎస్ ఇంటెన్స్ గా పాడారు. 'భగ భగ..' సాంగ్ ఎలా ఉందో చూస్తే – 'మనిషేనా నువ్వు, ఏమైపోతున్నావు, మృగమల్లె మారి దిగజారి పోయావు, భగ భగ భగ భగ మండే నీలో ఏదో సెగ, అంతులేని ఏంటి దగా, మనిషేనా నువ్వు, ఏమైపోతున్నావు, మృగమల్లె మారి దిగజారి పోయావు..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. అరి' సినిమా ప్రస్తుతం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదల సిద్ధమవుతోంది. త్వరలోనే ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్ ను మూవీ టీమ్ అనౌన్స్ చేయనుంది.



## త్వరలో అవార్డ్ విన్నింగ్ మూవీ 'ముత్తయ్య'

అవార్డు విన్నింగ్ మూవీ ముత్తయ్య త్వరలో ఈటీవీ విన్ లో ప్రీమియర్ కు రెడీ అవుతోంది. సినిమాల్లో నటించాలనే కలగనే 70 ఏళు వృద్ధుడి కథను తెరపై హృద్యంగా ఆవిష్కరించిందీ సినిమా. తన కలను నెరవేర్చుకునే క్రమంలో ఎన్నో అడ్డంకులు అధిగమించిన అతని జర్నీ ఎంతో స్ఫూర్తిని పంచుతుంది. ముత్తయ్య సినిమాను దర్శకుడు భాస్కర్ మౌర్య రూపొందించారు. ఈ చిత్రాన్ని హైలైఫ్ ఎంటర్‌టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిక్షనరీ ఎంటర్టైన్మెంట్ ఎల్ఎల్పి బ్యానర్లపై వంశీ కారుమంచి, వృందా ప్రసాద్ సంయుక్తంగా నిర్మించారు. దివాకర్ మణి ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ మరియు సహ నిర్మాతగా కూడా వ్యవహరించారు. బలగం, బాపు వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న కె. సుధాకర్ రెడ్డి, అరుణ్ రాజ్, పూర్ణ చంద్ర, మౌనికా బొమ్మ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. కామెడీ డ్రామాగా తెరకెక్కిన ముత్తయ్య సినిమా లండన్ లోని యుకె ఏషియన్ ఫిల్మ్ ఫెస్టివల్లో వరల్డ్ ప్రీమియర్ గా ప్రదర్శితమైంది. 28వ కోల్ కతా అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఇండియన్ లాంగ్వేజెస్ కేటగిరీలో ఉత్తమ ఫీచర్ ఫిల్మ్, దుబాయ్ లోని మెటా ఫిల్మ్ ఫెస్టివల్లో ఉత్తమ తొలి దర్శకుడు, ఇండిక్ చిత్రోత్సవాల్లో ఉత్తమ చిత్రం అవార్డులను గెలుచుకుంది. ఇది సౌత్ ఏషియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మాంట్రియల్ (కెనడా), హ్యాబిటాట్ ఫిల్మ్ ఫెస్టివల్ (న్యూ ఢిల్లీ) ఇండియా, ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ అల్బెర్టా (కెనడా), థర్డ్ యాక్షన్ ఫిల్మ్ ఫెస్టివల్ (కెనడా), సినిమాకింగ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (బంగ్లాదేశ్), ఇస్చియా గ్లోబల్ ఫెస్టివల్ (ఇటలీ) లలో కూడా ప్రదర్శించబడింది. ఈటీవీ



విన్ లో ఈ చిత్రం ప్రీమియర్ కాబోతున్న సందర్భంగా దర్శకుడు భాస్కర్ మౌర్య మాట్లాడుతూ – ఈటీవీ విన్ ద్వారా ముత్తయ్య చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం సంతోషంగా ఉంది. నా మొదటి సినిమా ముత్తయ్య అనేక చలన చిత్రోత్సవాలలో గొప్ప గుర్తింపు పొందినందుకు ఆనందంగా ఉంది.

పలు అవార్డ్స్ మా మూవీకి దక్కాయి. ప్రేక్షకులు ముత్తయ్య సినిమాను ఆదరిస్తారని నమ్మకం ఉంది. కె సుధాకర్ రెడ్డి, కొత్త నటుడు అరుణ్ రాజ్ అద్భుతంగా నటించారు. అన్నారు.



## వారియర్ లుక్‌లో నేషనల్ క్రష్

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా "ది గర్ల్ ఫ్రెండ్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇవాళ రశ్మిక మందన్న బర్త్ డే సందర్భంగా "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా నుంచి విషెస్ చెబుతూ కొత్త పోస్టర్, టీజర్ సాంగ్ 'రేయి లోలోతుల' రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో రశ్మిక వారియర్ లుక్‌లో గన్, కత్తితో పవర్ ఫుల్‌గా కనిపిస్తోంది. 'రేయి లోలోతుల' పాటను మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వాహబ్ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేయగా, రాకేందు మౌళి క్యాచీ లిరిక్స్ అందించారు. విజయ్ దేవరకొండ, హేషమ్ అబ్దుల్ వాహబ్, చిన్మయి శ్రీపాద ఆకట్టుకునేలా పాడారు. ఈ పాటలో వచ్చే పోయెమ్ ను డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ రాశారు. 'రేయి లోలోతుల' పాట ఎలా ఉందో చూస్తే – 'రేయి లోలోతుల సితార, జాబిలి జాతర, కన్నులలో వెన్నెలలే కురిసే, మదిమోసే తలవాకిట తడిసే, యెద జారెనే మనసు ఊగెనే, చెలి చెంతలో జగమాగెనే, యెద జారెనే మనసా..' అంటూ మంచి లవ్ ఫీల్ తో సాగుతుందీ పాట. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఉన్న "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

## డార్క్ షేడ్‌లో క్యూట్‌గా

చిన్నారి పెళ్లి కూతురు సీరియల్‌తో తెలుగు ప్రేక్షకులకు బుల్లి తెర ద్వారా పరిచయం అయ్యి, ఆ తర్వాత ఉయ్యాల జంపాల సినిమాతో వెండి తెరపై అడుగు పెట్టింది. మొదటి సినిమాతో హీరోయిన్‌గా మంచి గుర్తింపు దక్కించుకున్న అవికా గోర్ ఆ తర్వాత పలు సినిమాల్లో నటించి మెప్పించింది. హీరోయిన్‌గా అవికా గోర్ కొన్నాళ్ల పాటు బిజీగా ఉన్నప్పటికీ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకోవడంలో విఫలం అయ్యింది. అంతే కాకుండా కొన్ని అనవసర ఎంపికల కారణంగా సినిమా ఇండస్ట్రీలో ఈమె క్రేజ్ తగ్గుతూ వచ్చింది. టాలీవుడ్‌లో ఒకానొక సమయంలో ఈమెకు ఆఫర్లు లభించడమే కష్టం అయింది. సినమా ఇండస్ట్రీపై ఆసక్తి, ఫ్యాషన్‌తో అవికా గోర్ ప్రయత్నాలు చేస్తూనే వచ్చింది. ముఖ్యంగా తన ఫిజిక్ విషయంలో ఉన్న విమర్శలను ఆమె పోగొట్టుకునే ప్రయత్నం చేసింది. చాలా మంది హీరోయిన్స్ మాదిరిగానే బరువు తగ్గడం ద్వారా మరోసారి ఇండస్ట్రీలో రీ ఎంట్రీ ఇచ్చే అవకాశం దక్కించుకుంది. రీ ఎంట్రీలోనూ అవికా కు అంతంత మాత్రమే అన్నట్లుగా ఆఫర్లు వచ్చాయి. అందరు హీరోయిన్స్ మాదిరిగానే ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అవికా గోర్ సైతం రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసిన ప్రతి సమయంలోనూ వైరల్ అవుతూనే ఉంటాయి. తాజాగా మరోసారి ఈమె షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. డార్క్ షేడ్ ఔట్ ఫిట్ తో పాటు డార్క్ కలర్ లిప్ స్టిక్ కనిపించింది. అవికా క్యూట్ అందాలతో ఆకట్టుకుంది. సాధారణంగా హీరోయిన్స్ స్కిన్ షో చేసిన ఫోటోలకు మంచి డిమాండ్ ఉంటుంది. కానీ ఈ ఫోటోల్లో అవికా పెద్దగా స్కిన్ షో చేయకున్నా అందంగా కనిపించడం ద్వారా ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. ఈమె అందంకు తగ్గట్లు ఇండస్ట్రీ నుంచి ఆఫర్లు రాకపోవడం దారుణం అని, ముందు ముందు అయినా ఈమెకు ఆఫర్లు రావాలని అభిమానులు సోషల్ మీడియా ద్వారా కోరుకుంటున్నారు.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144